Entered
కథా నిలయం
శ్రీకాకుళం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

నవంబర్ 26, 2006









ఇంట్లో రోబోట్లు

హ్యాపీ బర్త్‌డే

(26.11.2006 నుండి 2.12.2006 వరకు)

డి. డేవిడ్ లివింగ్‌స్టన్
3సం॥, డిసెంబర్-5
మేరీలత-సురేష్‌కుమార్
పాణ్యం-కర్నూలు జిల్లా.

జి. పూజిత
2సం॥, డిసెంబర్-6
పరిమళజ్యోతి-కృష్ణమూర్తి
పత్తికొండ-కర్నూలు జిల్లా.

ముడిమి మౌర్యతేజ
డిసెంబర్-6
రాజేశ్వరి-వెంకటాచలపతి
కొడవలూరు-నెల్లూరు జిల్లా.

ఆర్. రమ్యతేజ
డిసెంబర్-8
నిర్మలమేరి-దాస్‌చౌదరి
హయత్‌నగర్

షాయాన్ అన్సార్
నవంబర్-12
నఫిస్ ఫాతిమా-కమాలుద్దీన్
పటాన్ చెరు మెదక్

అత్తిమూరు యామిని
నవంబర్-30
సుజన-శ్రీనివాస్
కొండాయపాలెం గేట్ -నెల్లూరు జిల్లా.

రామవత్ గీతాంజలి
2సం॥, నవంబర్-27
చిన్నబాయి-రాములు
అక్కారం-అచ్చంపేట

డి. ప్రవల్లిక
1సం॥, నవంబర్-28
నాగమణి-నర్సింగరావు
రామాయగూడెం-ఖమ్మం జిల్లా

సుష్మ
3సం॥, నవంబర్-24
విజయ-శేఖర్
ఇందిరానగర్-మెదక్ జిల్లా.

లౌకిక (కృష్ణ)
2సం॥, నవంబర్-28
మహేశ్వరి-రాములు
అచ్చంపేట-మహబూబ్‌నగర్

కథా నిలయం
శ్రీకాకుళం



ముందు మనం సరిగ్గా ఉండాలి...

మన అతిథి గురించి...

పేరు	:	తోట వైకుంఠం
జననం	:	02.02.1952, బూరుగుపల్లి, కరీంనగర్ జిల్లా
విద్య	:	పెయింటింగ్‌లో డిప్లోమా
వృత్తి	:	ఆర్టిస్ట్
అవార్డులు	:	పెయింటింగ్‌లో జాతీయ అవార్డు, దాసి చలనచిత్రానికి ఆర్ట్ డైరెక్టర్‌గా జాతీయ అవార్డు
ఆదర్శం	:	కష్టపడి పనిచేసేవాళ్లు
నచ్చిన పుస్తకాలు	:	గోరా, సిద్దార్థ
నచ్చిన వ్యక్తులు	:	గురువుగారు (సుబ్రహ్మణ్యం)
నచ్చని అంశం	:	స్వాతంత్ర్యం వచ్చి 58 ఏళ్లైనా ప్రజలకు విద్య అందకపోవడం
ఆశయం	:	మంచి కళాకారుడవడం
బలం	:	కృషి
బలహీనత	:	పొగడ్తలు
హాబీలు	:	పుస్తకపఠనం, సంగీతం వినడం
మరచిపోలేని సంఘటన	:	బాల భవన్‌లో ఉద్యోగం రావడం

ఇప్పుడంతా వ్యాపారాత్మకమైంది. చేసేపనిని మనస్ఫూర్తిగా చెయ్యడంలేదు. తాము చేసే పనికి న్యాయం చేయాలి. దీన్ని కృషిద్వారా సాధించాలి. దీనివల్ల ఇతరులకు మంచి జరుగుతుంది. మానవత్వ విలువలు లేకుండా చేసే ఏ పనైనా అదెంత గొప్పదైనా ప్రయోజనం శూన్యం. అందరూ అనుకుంటున్నట్లు యువత చెడిపోలేదు. కాకపోతే గతంలో గురువులు చెప్పినట్లు వినేవారు, వాళ్లను గౌరవించేవారు. వారిపట్ల భక్తి ఉండేది. కానీ ఈ తరం పిల్లలు పెద్దవాళ్ళు, గురువులు చెప్పినట్లు వినడం లేదు. నా అంతట నేనే చేస్తాననే ధోరణి పెరిగింది. అందువల్ల పిల్లలకి మంచి, చెడు గురించి స్పష్టమైన అవగాహన లేదు. మనం తప్పు చేస్తూ వాళ్లకు నీతులు చెప్పడం సరికాదు. ముందు మనం సరిగ్గా ఉంటూ దిశానిర్దేశం చెయ్యాలి. మనందరం రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలి. మన ధర్మాన్ని పాటించాలి. టీచర్లు, ప్రజానాయకులు, వివిధ రంగాల్లోని వాళ్లు నీతిగా, నిజాయితీగా ఉండాలి.

ఈ సంచికలో...

టపా ... 2
సెన్సూ కామన్ సెన్సు ... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
క్యాంపస్ ఛాట్ 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14

ఇంకా...

ఇలా వుందామా... 7
సహనం

సీరియల్ 8
తెలుగుగడ్డ

కథ 18
గంగపుత్రులు

అవీ... ఇవీ ... 20
మనసా... తెలుసా ... 22
విజ్ఞానవీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24

అలరిస్తున్నాయి

12.11.2006 సంచిక అట్టమీది బొమ్మ సర్వాంగ సుందరంగా ఉంది. తెలుగుగడ్డ సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది. 'మనసా తెలుసా' శీర్షిక ప్రాముఖ్యతను సంతరించుకుంది. అనేక అంశాలతో స్నేహను అలరించేలా అందిస్తున్నందుకు కృతజ్ఞతలు. ఆరోగ్యం, ఇలా ఉందామా, ఇంటిసంగతులు.. అన్నీ బాగున్నాయి. మమ్మల్నెంతగానో ఆకట్టుకున్నాయి.

అన్నే వెంకటకృష్ణారావు, గన్నవరం, కృష్ణాజిల్లా

అవి రుచిగా ఉండవు

వనభోజనాల కంటే పిల్లల దినోత్సవ సంబంధ వ్యాసం వేసి ఉంటే బాగుండేది. అయితే కార్తీక వనభోజనాల వివరాలు కూడా చక్కగానే అందించారు. వనభోజనాలవల్ల మనకు వృక్షాలతో మైత్రి పెరుగుతుందనటం వాస్తవం. మోకాలినొప్పులకు కీళ్లమార్పిడి అవసరమా? మెంతి ఆరోగ్యానికి మంచిదేమోకానీ, ఈ వంటకాలు రుచిగా ఉండవు.

వాస్తురామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు.

కనువిప్పు కలగాలని...

'ఇంటి సంగతులు' శీర్షికలో చెప్పినట్లుగా కామాక్షిలాంటివారు మనచుట్టూ చాలామందే ఉంటారు. సినిమాల్లోని పాత్రలను, వారి విజయాలను చూసి తమ పిల్లలనూ అలా తీర్చిదిద్దాలని కొందరు తల్లిదండ్రులు ప్రయత్నిస్తుంటారు. వారందరికీ ఈ కథనంతో కనువిప్పు కలగాలని కోరుకుంటున్నాం.

రమాకాంత్, నీరజ, ఖమ్మం

ఆహ్లాదం, ఆరోగ్యం

అడపాదడపా కాకపోయినా కనీసం ఏడాదికొక్కసారైనా వనభోజనం చేయడంవల్ల మనకు ఆహ్లాదం, ఆనందం, ఆరోగ్యం కలుగుతుందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా ఈ కార్తీక మాసంలో అయితే మరీ బాగుంటుంది. పల్లెలను ఆనుకుని ఉండే అడవులిప్పుడు కనుచూపుమేరలో కనిపించడంలేదు. పల్లెలు, పట్నాలు హైటెక్‌పార్కులను ఇప్పుడు ఆశ్రయించాల్సిందే. వనం... జనం... కలిసుంటేనే విరామం!

భాగ్యరాజ్, పొన్కల్

వనభోజనాల వైశిష్ట్యం

'సినిమాకబుర్లు'శీర్షికలో శ్రీ పరుచూరి గోపాలకృష్ణగారి అనుభవాలు చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. 'అట్టమీది కథ' 'వనం...జనం... కలిసుంటేనే వికాసం'లో వనభోజనాల వైశిష్ట్యంగురించి విపులంగా వివరించారు.

మంజుల, తిరుపతి

కంటతడి

కథ జననం చాలా బాగుంది. చివరివరకూ ఆసక్తికరంగా చదివించింది. చివరికి కళ్లలో తడి మిగిల్చింది. 'ఆరోగ్యం' శీర్షికలో కీళ్ల అరుగుదల గురించి వివరించడం ప్రయోజనకరంగా వుంది. కవర్‌పేజీ ఆకర్షణీయంగా ఉంది.

రాజేష్, గోదావరి ఖని

పరుల కోసం

'సెన్సు కామన్ సెన్సు'లో పరులకోసం ఆర్టికల్ నిజజీవితానికి అద్దంపట్టింది. 'న్యాయసలహాలు'శీర్షిక బాధితుల వ్యథను తీర్చేలా ఉంది. వారికి న్యాయం చేకూర్చడానికి మీరు చేస్తున్న ప్రయత్నం ప్రశంసించదగ్గది. 'ఇంటిసంగతులు', 'ఇలా ఉందామా', 'క్యాంపస్ ఛాట్' శీర్షికలు బాగున్నాయి.

వి. రేవతి, అదిలాబాద్

ప్రయోజకత్వం సిద్ధిస్తుంది

నవంబర్ 12 నాటి స్నేహలో అట్టమీది కథ 'వనం...జనం... కలిసుంటేనే వికాసం' అంటూ బెంజిమన్ త్రిపురా అందించిన స్పెషల్ స్టోరీ సందర్భోచితంగా ఉంది. వనభోజనాల వైశిష్ట్యం ఏమిటో సవివరంగా తెలియజేసింది. ఓపక్క అందరూ ఒకచోట కలుస్తున్నారన్న ఆనందం ఉన్నా అసమానతలను స్ఫురింపజేసే కులాల వారీ, వర్గాల వారీ, విభజనతో కూడుకున్న విహారాలు ఎందుకాని ఒక్కోసారి అనిపించే విస్మయాన్ని కలిగించక తప్పటంలేదు. ఆరోగ్యం శీర్షికద్వారా 'కీళ్ల ఎందుకు అరుగుతాయి?' అనే విషయంగురించి చక్కగా అర్థమయ్యేవిధంగా వివరించారు. చక్కగా సరితూగే వనభోజనాల కార్టూన్లు ముచ్చటగా వుండి అలరింపజేశాయి. విజ్ఞానవీచికలో వివరించినట్లు శాస్త్ర సాంకేతికాభివృద్ధి పరిశోధనలపై సామాజిక అదుపాజ్ఞలు ఉండకపోతే ప్రైవేటు వ్యక్తుల స్వార్థపరత్వానికీ, అలవికాని వినాశానికి దారితీసే దుస్థితి లేకపోలేదన్నది నిజం. ఈ వారం అతిథి రాజన్‌బాబుగారన్నట్లు కళలద్వారా విలువల్ని కాపాడినప్పుడే వాటికొక ప్రయోజకత్వం సిద్ధిస్తుంది. ధన్యవాదాలు.

నేమాన సుభాష్ చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	రూ.
రూ.130/-	రూ.170/-	రూ.210/-	510/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

రూ. 150/-కే

ఇవన్నీ!

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్కసీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

- కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/-లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

3914

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

సెన్సూ కామన్ సెన్సు



రుక్మిణి

పొదుపు

"అబ్బో... ఆయనకేం మారాజు... చేయి కదపకనే బతికారు... అబ్బో...!" మా వూర్లో వెంకుపంతులుగారిగురించి జనం చెప్పుకునే మాటలివి. పంతులుగారిప్పుడు లేరు. చిత్రం! పంతులుగారి చేతికి ఎముకల్లేకపోడం వల్లనే చివరి రోజుల్లో ఎముకల పోగయ్యాడు. చితికిన గుడిసెలో అల్లల్లాడుతూ వెళ్ళిపోయాడు.

"పొదుపు చాలా అవసరంరా.... అది అవసరాల్లో ఆదుకుంటుంది" అని మా నాయనమ్మ చెబుతూ ఉండేది. చాలా ఉదాహరణలతో వివరించేది. పంతులు వ్యవహారాన్ని దానికి సాక్ష్యంగా నా ముందుంచుతూండేది.

"అరె... నాకు సంపాదనే లేదాయె. ఇక పొదుపేంటి?" కయ్యిమని లేస్తాను నేను.

మా నాన్న చప్పున అందుకుంటాడు. "ఒరె... నేనిపుడు నీకో వంద ఇచ్చాననుకో.. దాన్నివాళే హారతి కర్పూరం చేయక.... ఒకటి.. రెండు.. మూడు.. ఒక వారం.. రెండు వారాలు.. నెల్రోజులు వుంచావనుకో... అదేరా పొదుపు. మరో విషయం.. అదే నీ ప్రథమ సంపాదన అవుతుంది" అని బోధిస్తాడు.

లోతుగా ఆలోచిస్తే మా నాన్న చెప్పిన మాటల్లో చాలా అర్థం వుందనిపిస్తుంది. చిన్న చిన్న ఆర్థికావసారాలకోసం మనం అప్పు ఎవర్ని అడుగుతున్నాం?! ఆఫ్టరాల్ వాడూ మన్లాంటి ఒక సాధారణజీవి. మరి మన దగ్గరలేనిది వాడిదగ్గరెందుకుందీ?! మిలియన్ డాలర్ క్వశ్చన్! మిగులూ, అధికసంపాదనల చర్చ వదిలేస్తే ఖచ్చితంగా వాడు పొదుపరి అయివుంటాడు.

ఈ విషయంలో మా బాబాయిని చెప్పుకోవాలి. జీతం రాగానే టంచనుగా సేవింగ్సులో కొంత జమ కడ్తాడు. 'ఎట్లా గడుస్తుందిరా' అని ఎవరైనా అంటే "ఒరే దుప్పటి ఎంతవరకు సరిపోతే కాళ్ళను అంతవరకే ముడుచుకోవాలి... భారీగా చాచితే సరిపోదు" అని ఎకనమిక్సు చెప్తాడు.

ప్రపంచ బ్యాంకు సూత్రాలను లంకించుకున్న వాడెవడైనా "ఒరే చవటాయ్, దుప్పటి సరిపోకపోతే కాళ్ళకు సరిపడా పొడవాటి మహా దుప్పటి వెతుక్కోవాలి" అంటే బాబాయి గుడ్లు తేలేస్తాడు. సరిపోయే దుప్పటి అంటే 'వంకరమార్గాలు' అన్న విషయం ఆయనకు తెలీదాయె.

అయితే పొదుపు వేరు, పిసినారితనం వేరు. 'పిల్లికి బిచ్చం పెట్టకుండా' బతకడం దారుణం! ఆత్మీయులకూ, దగ్గరివాళ్లకూ చేతి ఎముక విరక్కుండా సహాయపడడంలో తప్పు లేదు. ఏదోఒక ఆదాయం లేకుండా బతకడం కష్టం. తాతలు సంపాదించిన ఆస్తైక్కూడా ముసలితనం వచ్చి, బకెట్టు తన్నేస్తుంది మరి! అప్పుడు చెంబూ-తపాళా, వీణా-తంబూరాలతో ఊరిమీద పడిపోయే ప్రమాదముంది.

అందుకే ఆదాయాన్ని ఎట్లా కేటాయించుకోవాలో ఒక ప్లాను చాలా అవసరం. ఇలా అంటే మా ఇంటి పక్క కూలీ చేసుకునే తిర్పతయ్య భగ్గున మండిపడ్డాడు.

"నెల జీతం వచ్చేవాళ్ళకు చెప్పుండ్రి ఈ కథలు.. నాకూ, నా పెళ్ళానికీ రోజూ పని దొరకటమే కష్టం. ముగ్గురు పోరగాండ్లు... ఇంగ దానికి ప్లానింగులు! పూట గడవటం కష్టం. రేప్పొద్దున ఇదీ నమ్మకం లేదాయే! గండుకె ఇవాల్టి సంపాదన గివ్వాల్నే! (సుక్కేసుకునే అలవాటుంది మరి) ఏం బతుకులో!"

తిర్పతయ్య ఎకనమిక్ సూత్రాలు వేరు. ఈ పొదుపు సూత్రాలు ఆర్థికాంశాలకే పరిమితం కావు. నిత్యావసరాలకూ వర్తిస్తాయి. మా తాతయ్య "ఏంట్రా గాడిదా! పొదుపుగా జీవించమంటే పాతిక, ముప్పయ్యేళ్ళకు 'టపా' కట్టేయమనా? వందేళ్లూ బతకాల్సిందే..." అని బోసి నవ్వులు నవ్వుతాడు. ఆయనదో ఫిలాసఫీ!

నగరంలో నీటి కొరత! రేపు పంపులు వస్తాయోలేదో...! వున్న నీటిని ఈరోజే గుమ్మరించుకుంటే రేపు నీళ్ళకోసం మొహంవాయాల్సిన ప్రమాదం! అందుకే కనీసావసరాలకు ఎమర్జెన్సీలో పనికొచ్చేలా ఆలోచించడం అవసరం గదా!

"రెండు జతల బట్టల్తో నేను మెట్రిక్యులేషన్, పీయూసీ చేశా. నీకు బీరువానిండా బట్టలే. రెండు మూడు నెల్లకోసారి డ్రస్సులంటే కుదర్దు" అంటూ నాన్నగారు చిందులేస్తారు. దీనికి నేను రెండు సమాధానాలు చెప్తాను.

"నాన్నా! అపుడింత జనాభా, ఇన్ని ఫ్యాషన్లు... పోటీ ఏమీలేదు. ఆ రెండు జతలుండడమే గొప్ప! ఇక రెండోది మీ నాన్న ఉద్యోగస్తుడు కాదు, రైతు! నెల జీతాలుండవు కదా!" అంటాను. అందుకు మా నాన్న అగ్గిరావుడులా నవ్వి మా అమ్మవైపు తిరిగి "వీడి తెలివి ఇదీ.. ఏం చేస్తాం వెధవాయ్" అని విసుక్కుంటాడు.

"రైతులు రసాయనిక ఎరువుల్ని పొదుపుగా వాడితేనే లాభం" వ్యవసాయం అంటే ఏంటో తెలీని మా మావయ్య అంటాడు.

"డబ్బు ఆదా.. భూసారం.. అబ్బో.." అని పేలుతుంటే మా అత్తయ్య "ఓసారి అరక పట్టి చూడండి.. తెలుస్తుంది" అంటుంది.

"అదికాదే పొదుపు చాలా అవసరమే కానీ మనం సంపాదించేది ఖర్చుపెట్టేందుకే. పొదుపంటూ కాలం గడిపేస్తే ఆనక గడిచిన కాలాన్ని తిరిగి వెనక్కు తేగలమా? అబ్బే.. కుదర్దు... కనుక కాలం ఎలాగో వయసూ అంతే. దాన్ని తిరిగి సంపాదించలేం" అనేసి వెంటనే అక్కడినుండి జారుకున్నాను!

✤

కోర్టుకు అప్పీలు చేసుకోవాలి

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. న్యాయవాది

శ్రీ జి.ఎల్.నరసింహారావు

తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా:
ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం,
ఫ్లాట్ నెంబర్: 1,
అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది
9848994240

సార్! మాది శ్రీకాకుళం జిల్లా, బాలేరు గ్రామం. నేను మా ఊళ్ళో వున్న పోస్టాఫీసులో ఇ.డి.డి.ఎ.గా పనిచేశాను. మా పోస్టాఫీసులో మేం ముగ్గురం స్టాఫ్. ఒకరు బిపిఎం, ఒకరు ఇడిడిఎ, మరొకరు ఇడిఎమ్‌సి/డిఎ. ఇద్దరిమీ ఒకే కేటగిరికి చెందినవాళ్ళం. మా ఇద్దరిలో నేను ఇడిడిఎ సీనియర్. అయితే ప్రభుత్వంవారు మా ఇద్దరి పోస్టులలో ఒక పోస్టును రద్దు చేసింది. ఒక పోస్టు రద్దు అయినప్పుడు అందులో సీనియర్, జూనియర్ అని చూడకుండా సీనియర్‌ను వేరేచోటకు పంపించారు. ఈ విధంగా జూనియర్‌ను ఉంచి సీనియర్‌ను పంపించడంవల్ల సీనియర్‌కు జీతభత్యం తగ్గిపోయింది. సీనియర్ స్థానంలో జూనియర్ ఉంటున్నాడు. ఈ విధంగా చేయటంవల్ల సీనియర్ పొందవలసిన బెనిఫిట్సన్నీ జూనియర్ పొందుతున్నాడు. ఈ విషయమై కొంతమంది సలహా తీసుకుని ట్రిబ్యునల్ హైకోర్టుకు వెళ్తే దానికి కోర్టు మూడు నెలల లోపు ఆ స్థానాన్ని సీనియర్‌కు ట్రాన్స్‌ఫర్ చేయవలసిందిగా తీర్పిచ్చింది. కోర్టు తీర్పునుబట్టి నాకు జీతభత్యం సరిచేసింది. నాకు నా స్థానంనుండి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ పంపిస్తారు కదాని ఊరుకుండిపోయాను. ఆ తరువాత మూడునెలలకు మరల నా జీతభత్యాలు తగ్గించి జూనియర్ స్థానంలో ఉంచారు. తెలిసినవారికి హైకోర్టు తీర్పు చూపించగా 'మూడు నెలలు దాటిపోయింది కాబట్టి మళ్లీ నువ్వు కోర్టుకు అప్పీలు చేసుకోవాలి' అని చెబుతున్నారు. నేను నిరుపేదవాడిని. నాకొచ్చే జీతంతో ఇటు కుటుంబానికి, అటు పిల్లల చదువులకు ఖర్చుపెట్టలేక సీనియర్‌గా ఉండి జూనియర్ కన్నా తక్కువ జీతం తీసుకుంటూ మానసికంగా బాధపడుతున్నాను. హైకోర్టు అందించిన కాపీలు జతచేస్తున్నాను. దయచేసి తగిన సలహా ఇవ్వండి.

ఎల్. నీలకంఠరావు, శ్రీకాకుళం జిల్లా

మీకు అనుకూలంగా న్యాయస్థానం ఇచ్చిన తీర్పును విని కూడా డిపార్ట్‌మెంట్‌వారు దాన్ని మూడునెలలుగా అమలుచేయలేదని చెప్పారు. ఇలాంటి పరిస్థితిలో మీరు వారిపై కోర్టు ధిక్కారపు కేసు వేయవలసి వుంటుంది. మీకు కొద్దిరోజులు అంటే కోర్టు తీర్పు ప్రకారం సీనియర్ జీతం ఇచ్చి, మళ్ళీ తగ్గించడం జరిగిందంటే అది తప్పక కోర్టు ధిక్కార నేరమౌతుంది. మీరు కంటెమ్ట్ నోటీసు ఇచ్చి కేసు వేయవలసి వుంటుంది. మీకు తప్పక న్యాయం జరుగుతుంది.

ఇంటి సంగతులు

ఇంద్రగంటి జానకీబాల

పిచ్చిభయం

మిట్టమధ్యాహ్నం, చెమటలు కక్కుతూ వచ్చిన తమ్ముడు నందూని చూసి ఆదిలక్ష్మి కంగారుపడింది.

తలుపు తీస్తూనే ''అమ్మెలా వుందిరా?" అనడిగింది.

''ఆ.... బాగానే ఉంది... ఈ హైదరాబాద్‌లో కాస్తే ఒకటే ఎండ, కురిస్తే ఒకటే వాన" అన్నాడు.

ఆదిలక్ష్మి ఫ్యాను వేసి కూర్చోమనిచెప్పి మంచినీళ్ళిస్తానంటూ లోపలికెళ్ళింది.

అతను షర్టు బటన్లు తీసి ఫ్యానుగాలికి సేదతీరి మంచినీళ్ళు తాగాడు.

"ఓ ముఖ్యమైన మాట చెబుదామని వచ్చానే" అన్నాడు. ఒక్కక్షణం ఆదిలక్ష్మి గుండె దడదడలాడింది. ఈ తమ్ముడు, అతని భార్య కలిసినప్పుడల్లా గంటలు గంటలు ఇతను తల్లి గురించి ఆమె అత్తగురించీ చాడీలు చెప్తూనే ఉంటారు. ఆవిడ తనకీ తల్లే అయినా, వాళ్ళ దగ్గర ఉండటంవల్ల ఆమె గురించి వాళ్ళేం మాట్లాడినా నోరుమెదపడానికి వీల్లేకుండా కూర్చొని వినడమే ఆదిలక్ష్మి పని.

"ఏమిట్రా?" అంది.

"నేనీ నెలాఖరుకు రిటైరైపోతున్నాను. నువ్వెప్పుడో వాలంటరీ తీసుకున్నావనుకో, అయినా నీకూ, నాకూ పుట్టిన తేదీలో అయిదునెలలే తేడా ఉంది" అన్నాడు.

"అయితే ఏమైందీ, నా డేట్ ఆఫ్ బర్త్ నా ఎస్ఎస్ఎల్‌సి సర్టిఫికెట్లో ఉన్నదే నీది అంతే" అంది.

"నిజమేగానీ మనిద్దరం సొంత అక్కా తమ్ముళ్ళమని తెలిస్తే, ఎవరైనా ఈ డేట్సు పట్టుకుని గొడవ చేస్తారేమో"

"నీ కసలు బుద్ధుందా? మన వయసులు, మన సర్టిఫికెట్లలో ఉన్నవే ఖరారు. ఒకవేళ అప్పుడు తప్పుగా పడినా అదే కరక్టంటారుతప్ప దీన్నిప్పుడెవరూ పరిగణనలోకి తీసుకోరుగా" అంది.

"ఏమో నాకు చాలా భయంగా ఉంది. ఇది చూపించి, నా పెన్షన్ విషయంలో గొడవపెడితే?"

"అసలు నా ఉద్యోగం, డిపార్టుమెంటూ వేరు. నీది వేరు. నీ విషయాలు, సెటిల్‌మెంట్లు నీ రికార్డుల ప్రకారం చేస్తారు గానీ నావి చూసి కాదు. అసలు మనిద్దరివీ కంపేర్ చేయాల్సిన పనేముంది?"

"ఏముందీ అంటే నేనేం చెప్పలేను" అన్నాడు. నిర్లిప్తంగా ముఖం పెట్టి.

"అదికాదురా నువ్వు నిదానంగా ఆలోచిస్తే నీకు అర్థమవుతుంది. ఎప్పుడో రికార్డుల్లో రిజిష్టరైన తేదీలే ముఖ్యం. దాని ప్రకారం చూస్తారు. అక్కచెల్లెళ్లు వారి పుట్టినరోజులూ వాళ్ళ కెందుకూ? అసలు నా డేటాఫ్ బర్తెందుకు చూస్తారు? వాళ్ళకా అవసరమేముంటుంది?" అంది.

తమ్ముడు బిక్కముఖం పెట్టాడు. "నా పరిస్థితి అర్థం చేసుకో ఏదైనా గొడవై నా పెన్షన్ ఆగిపోతే"

"హయ్యోరామా... నీ రికార్డుల్లో ఏది ఉందో అదే ముఖ్యం" అంటూ ఆదిలక్ష్మి గొంతు పడిపోయేలా చెప్పిందే చెప్పి, తమ్ముణ్ణి ఒప్పించేందుకు ప్రయత్నించింది.

అతని ముఖంలో ఎంతకూ నమ్మకపు ఛాయలు కనిపించలేదు సరికదా మరింతగా కళావిహీనంగా తయారైంది.

ఎన్నో ఉదాహరణలు చెప్పింది. అసలలాంటి సమస్యేరాదని, తన రికార్డులెక్కడో డిపార్టుమెంటులో ఉంటాయని, అందువల్ల ఎలాంటి ఇబ్బందీ ఎదురవదని చెప్పి "స్కూల్లో చేర్పించేప్పుడు రాయించిన తేదీనే ఖరారుగా ఉంటుంది. అలా సర్టిఫికెట్‌లో వున్నదే జీవితాంతం లెక్కకి వస్తుంది" అంది.

"మా ఫ్రెండొకాయనికి అయిదేళ్ళ వయసు ఎక్కువపడి ఆ అయిదేళ్ళ సర్వీసూ పోయింది. ఆయనెన్ని జాతకచక్రాలు, జన్మ నక్షత్రాల వివరాలు చూపించి మార్చుకుని, సర్వీసు పొందుదామన్నా కుదరలేదు. కనుక నీది నీదే, నాది నాదే. ఒకవేళ అది తప్పే అయినా వాళ్ళా సంగతి పట్టించుకోరు. నువ్వేం బెంగపెట్టుకోకు" అంది ఆదిలక్ష్మి.

ఆమె తమ్ముడు అన్నీ విన్నాడుగానీ ముఖం విప్పారలేదు. ఆదిలక్ష్మి ప్రాణం విసిగిపోయి ఊరుకుంది. చివరిగా 'సరే ఇంతకీ ఇప్పుడేం చేద్దామనీ?" అంది.

"ఏం లేదులే, నేవస్తాను. ఏం జరిగితే అదే జరుగుతుంది" అన్నాడు నిరాశగా

అర్థంలేని భయంతో వాడు కుంగిపోతున్న విధానం చూస్తే ఆదిలక్ష్మికి ఒళ్ళు మండిపోయింది. ఇంత బుర్రలేనివాళ్ళు, ఇంతగా రూల్సును అర్థం చేసుకోలేనివాళ్ళూ మన ప్రభుత్వ సంస్థలలో ముప్ఫైనలభై సంవత్సరాలు ఉద్యోగాలు చేశారంటే ఆ డిపార్టుమెంటుల దుస్థితి అంతాఇంతాకాదు' అనుకుంది. అతని తీరుచూస్తే పెన్షను ఆగిపోయినట్టు, ఆర్థిక ఇబ్బందులతో అలమటించే రోజులు ముందున్నట్టు గజగజలాడిపోతున్నాడు.

రిటైరైనరోజు అందరికీ ఇంట్లో విందు ఏర్పాటు చేసిన తమ్ముడింటికి వెళ్ళాలనిపించలేదు. కానీ మరీ నలుగురిలో బాగుండదని వెళ్ళింది. ఆఫీసులో వాళ్ళు కొందరొచ్చారు. తమ్ముడు "ఈవిడ మా అక్కయ్య.. అంటే కజిన్ అన్నమాట" అంటూ ఆఫీసువాళ్ళకి పరిచయం చేయడం చూసి ఆదిలక్ష్మి అవాక్కయి నిలబడిపోయింది.

ఇలా వుందామా...

తంగెళ్ళపల్లి కనకాచారి

సహనం

బస్‌స్టాపులో సుధ, భార్గవి, ముంతాజ్, ఒక గ్రూపుగా... కొంత దూరంలో పృథ్వీ, ఆకాష్, అల్లావుద్దీన్ మరో గ్రూప్‌గా నిల్చున్నారు.

"సుధా, మియాపూర్ బస్ వస్తోంది, ఎక్కేద్దామా?" అంది భార్గవి.

"బాగా రష్‌గా వుందే, ఐనా పృథ్వీవాళ్ళు ఎక్కాలిగా"

అంతలో పృథ్వీ అటునుండి సైగ చేశాడు 'ఎక్కేద్దామా' అన్నట్లుగా. అందుకు సరేనన్నట్లు తలూపింది సుధ. తీరా బస్ వేగంగా వచ్చి, స్టాపులో ఆగకుండానే వెళ్ళడంతో "ఛట్....బస్ ఆపకుండా వెళ్లాడు" అంది సుధ కోపంగా.

"రష్‌గా వుందిలేవే...!" సముదాయించింది ముంతాజ్. ఓ పది నిమిషాల తర్వాత మరో బస్ వచ్చింది. ఖాళీగానే వుంది. మిత్రులంతా బస్ ఎక్కేశారు.

బస్‌లో ఎఫ్.ఎం. రేడియో మోగుతోంది.

"మౌనంగానే ఎదగమని... మొక్క నీకు చెబుతుంది..." పాట మధురంగా విన్పిస్తోంది.

"ఆకాష్! ఎఫ్.ఎం. రేడియో కొంటానన్నావుగా, ఏమైంది?" అల్లావుద్దీన్ అడిగాడు.

"రేపు కొంటున్నారా, అవునూ, ఫిజిక్స్ ఎగ్జాంలో ఎన్ని మార్కులొచ్చాయిరా?" అడిగాడు నవ్వుతూ ఆకాష్.

"అల్లా, ముంతాజ్‌కు ఎన్ని మార్కులొచ్చాయటా?" ప్రశ్నించాడు పృథ్వీ.

"తెలీదురా, ఇపుడే అడుగుతానుండు" అని, "మార్కులెన్ని ముంతాజ్?" అంటూ కేకేశాడు.

"బస్‌లో కేకలేంటి?" అంది భార్గవి నవ్వుతూ. ముంతాజ్ అదేం పట్టించుకోకుండా గాల్లో చేతులు తిప్పుతూ 25 అర్థం వచ్చేలా సైగ చేసింది నవ్వుతూ.

అల్లావుద్దీన్‌కు అర్థమైంది. తలూపి "రేపు ఫిఫ్టీ మార్కులకు ఎగ్జాం అట. ఈరోజు 30 మార్కులకే పెట్టారుగా...!" అన్నాడు అల్లావుద్దీన్.

"సరే లేరా, ఈ రోజైనా కాస్త బాగా చదవాలి" అన్నాడు పృథ్వీ.

బస్ పంజగుట్ట వచ్చేప్పటికి బాగా రష్ అయ్యింది నిల్చునే చోటేలేదు. ఫుట్‌బోర్డ్ దగ్గర ఎవరో ఇద్దరు గొడవ పడ్తున్నారు.

"చూసి ఎక్కలేవా, కళ్ళు ఎక్కడ పెట్టుకున్నావు?"

"ఏయ్, మర్యాదగా మాట్లాడు, బస్ వెంటనే కదిలింది.. ఐనా నీక్కళ్ళు లేవా? ఎక్కేప్పుడు కాస్త పక్కకు జరగొచ్చుగా.... బర్రెలా కదలకుండా నిల్చున్నావు"

"నా కాలు తొక్కింది కాకుండా, పైగా నామీదే అరుస్తావా? కిందికి దిగరా...!"

"ఏం చేస్తావురా నువ్వు?! నీలాంటోళ్ళను వందమందిని చూశా"

"ఎక్కువ వాగుతున్నావు" అంటూ ముందుకొచ్చి చొక్కా పట్టుకున్నాడు. రెండో వ్యక్తి కూడా చొక్కా పట్టాడు. ఇద్దరూ బస్‌లో పరస్పరం నెట్టుకుంటున్నారు. పృథ్వీ ముందుకొచ్చి "అన్నా, గొడవెందుకు, ప్లీజ్ ఎవరో ఒకరు సర్దుకుపొండి" అన్నాడు

"ఏంటయ్యా, వీడు నా గల్లా పట్టుకుంటాడా, మీరే చెప్పండి" ముగ్గురు ఫ్రెండ్స్ వచ్చి గొడవపడ్తోన్న ఇద్దర్నీ విడిపించారు.

పక్కనున్నవాళ్ళు కొందరు "పోనీయండి.. పోనీయండి" అని సర్దిచెప్పారు.

మూసాపేట రాగానే గొడవ పడ్తున్న ఇద్దర్లో ఒకడు కిందికి దిగాడు. మరొకడు ఫుట్‌బోర్డుపైనే నిల్చున్నాడు.

ఇక కిందికి దిగినవాడు బూతులు తిడ్తూ పైన వున్నతన్ని "దిగరా, కిందికి.. అక్కడే వున్నావే?" అంటూ కాలు పట్టుకుని లాగుతున్నాడు. బస్సేమో కదుల్తోంది. బస్‌లో ఉన్నవాడు బూతులు తిడ్తూనే కాలిని లాక్కుంటున్నాడు.

ఫ్రెండ్స్ కల్సి బస్‌లో ఉన్నవాడిని పైకి లాగారు.

బస్‌వేగం పుంజుకుంది.

కింద వున్నవాడు తిడ్తూనే వున్నాడు. బస్ ముందుకు కదిలింది. మరో స్టేజ్ రాగానే ఇతనూ దిగిపోయాడు.

"మనుషులకు ఓపిక బొత్తిగా లేకుండా పోయింది" అంది భార్గవి విసుగ్గా ముఖం పెట్టి.

"అవునే... వాళ్ళిద్దరూ ఎప్పటినుండో శత్రువులైనట్లు అంత కఠినంగా ఎలా మాట్లాడతారు?" అంది సుధ.

"పెరిగిన వాతావరణం" అందుకున్నాడు పృథ్వీ.

"నిరక్షరాస్యులైతే గొడవ పడ్డారంటే అర్థముంది. అరే చక్కటి జాబ్ చేసే ప్రొఫెషనల్స్, కాలేజీ స్టూడెంట్స్... ఆడవాళ్ళు కూడా తక్కువ తినలేదనుకో... అందరూ ఇలా హార్ష్‌గా ప్రవర్తిస్తారేంటి?" అంది సుధ.

"దీనికి పరిష్కారం లేదా?" అంది ముంతాజ్.

"ఉంది. తోటి మనిషి తనలాంటివాడే అనుకునే విశాల దృక్పథం, సర్దుకుపోయే తత్త్వం, సహనం, ప్రేమ అలవర్చుకుంటే చాలు" బదులిచ్చాడు పృథ్వీ.

"బస్‌లో అందరూ ఉన్నారు, వారికి ఇబ్బంది అవుతుందని కూడా అనుకోరేంటి?" అంది ముంతాజ్

"ఎందుకనుకుంటారు ముంతాజ్, ఎవరిస్వార్థం వారిది" అంది సుధ.

"ఎవరి హడావుడి వారికుంటుంది. ఓ అర్థగంటో, గంటో ఓపిగ్గా వుంటే సరిపోతుంది. బస్ అందరిదీ అనుకుని మనమే సర్దుకుపోవడం, పొరపాటైతే 'సారీ' అనడం చేస్తే సరిపోతుందిగా.. చిన్నదానికి పెద్ద ఇష్యూ చేసి నానా రాద్ధాంతం చేయడం, అందరికీ తలనొప్పి తేవడం ఎందుకు? మనుషులు మారాలబ్బా..." అన్నాడు పృథ్వీ.

ఆకాశ్ కల్పించుకుని "చర్చించింది చాల్లేగాని మియాపూర్ వచ్చింది, కబుర్లాపి పదండి" అనడంతో మిత్రులందరూ బస్ దిగారు.

✣

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

జరిగిన కథ

యానాదివాళ్ళు తమ భాగాలు పంచుకుని వెళ్ళగా వచ్చిన బంగారమంటూ రూబేను ఒక మూటను అందించగా 'ఇంత కొంచెమా' అని నిరుత్సాహపడ్డాడు పటేలు.

తెలుగుగడ్డ

(45వ భాగం)

"ఇవన్నీ గడీలోనే దొరికాయట్రా?" అడిగాడు పటేలు.

"గడీలోకాక ఇట్లాంటి నగలు రైతువారీ కొంపల్లో దొరుకుతాయంటారా?" అన్నాడు రూబేను.

"అదికాదురా, ఎక్కడయినా భూస్థాపితం చేసి ఉన్నాయా? లేక పెట్టెలు, బీరువాల్లో ఉంటే ఎత్తుకొచ్చారా అని అడుగుతున్నాను. ఎందుకంటే పెద్దపెద్ద దేశముఖులు తమ సంపదనంతటినీ ఎవరికీ తెలీకుండా భూగృహాలు కట్టించి దాచివేస్తుంటారులే"

"అట్లాంటి భూగృహాలేమీ లేవు దొరా. దేశముఖ్‌గారు పడుకునే గదిలో ఇనుప బీరువాలోనే ఇవన్నీ దొరికినయ్"

"అది సరేగానీ మీరు దోపిడీ సాగిస్తూంటే దేశముఖ్‌గారు ఏమయినా తిరగబడ్డాడా?"

"తిరగబడతాడా పాడా? మమ్మల్ని చూసేసరికి ఆయన, ఆయన భార్యా ఇద్దరూ వణుకుతూ నిలబడ్డారు"

పటేలు తలూపాడు. "వెధవ. నిజంగానే సంగంవాళ్లు వచ్చి గడీ ముట్టడి వేశారని భయపడి ఉంటాడు" అన్నాడు.

"అక్కడే ఒక చిన్న పొరబాటు జరిగింది దొరా"

"ఏమిట్రా అది?"

"అందరం గడీమీద పడి గదులు సోదాలు చేస్తున్నాం. యానాది నాయకుడి కొడుకట, వాడికి గడీలో పనిచేసే దాసీదానిపై కన్నుపడింది. ఆ దాసీ దాన్ని మేడ వెనక్కు గుంజుకుపోయి చెరిచాడు. మేం నగలు నట్రా మూటలు గట్టుకుని బయలుదేరే సమయానికి ఆ దాసీది అక్కడికి పరుగెత్తుకుని వచ్చింది. దేశముఖ్‌గారితో తనకు జరిగిన అవమానం చెప్పుకుని ఏడుస్తోంది. అదిచూసి యానాది మూకవాళ్లంతా తలా ఒక రీతిన హేళన చేశారు. యానాది నాయకుడు కూడా నవ్వుతూ "రోలు పోయి మద్దెలకు చెప్పుకుందట" అని పరిహాసంగా మాట్లాడాడు. దేశముఖ్‌గారు తలూపారు. 'సంగంవాళ్లు నాకు బాగా తెలుసును. వాళ్లకు నీతి నియమాలున్నాయి. వాళ్లు ఇలాంటి దోపిడీలు, మానభంగాలు చేయడానికి సమ్మతించరు. కానీ ఇది మాత్రం వాళ్ల వేషాలతో వచ్చిన దోపిడీమూక" అన్నాడు. ఆ మాటలు అందరి వెనక నడుస్తున్నా ఒక్కడికే వినిపించినయ్. ఇదీ జరిగిన విషయం దొరా"

పటేలు చీదరించుకున్నాడు. "ఛీ-ఛీ అల్లరిమూక. ఆ వెధవ చేసిన పనికి మీరంతా సంగంవాళ్లు కారని దేశముఖ్ పసిగట్టగలిగాడు" అన్నాడు.

రూబేను ఆ చీకట్లోనే తలవంచుకున్నాడు. తర్వాత రెండు నిమిషాలపాటు నిశ్శబ్దం గడిచిపోయింది. పటేలు భారంగా నిట్టూర్చాడు.

"నరేలే. జరిగిపోయినదానికి ఇప్పుడనుకుంటే మాత్రం లాభమేమిటి?" అన్నాడు. "ఇక వెళ్లిపోదాం ఇవి తీసుకో" అన్నాడు తిరిగి. జేబులో ఉన్న నోట్ల కట్టలు తీసి రూబేను వడిలో పడేట్టుగా విసిరాడు. రూబేను ఒడిలో పడ్డ కట్టలు తీసి లెక్కపెట్టుకున్నాడు. "నాలుగు కట్టలు ఇచ్చారు?" అన్నాడు.

పటేలు నవ్వాడు. "కట్టకు వంద రూపాయలున్నాయ్. నాలుగు కట్టలు నాలుగు వందల రూపాయలు. చాలవట్రా?" అన్నాడు.

"తమరిదయ. బానిసోణ్ణి" అన్నాడు రూబేను.

పటేలు ఇంకో కట్టతీసి అతడి చేతుల్లోకి విసిరాడు. "నీ వద్ద ఎక్కువగా డబ్బు ఉండకూడదురా. నీ జేబులో విచ్చలవిడిగా డబ్బు ఉండడం చూసి అందరూ అనుమానిస్తూనే ఉంటారు. ఇప్పటికిది తీసుకెళ్లు. అవసరం పడినప్పుడు వచ్చినన్నడుగు. ఇస్తుంటాలే. అదీగాక ఇంతటితో మనకు తీరిపోయింది గనుకనా? ఎల్లుండి అమావాస్య గదూ? ఆ రోజున ఎర్రగూడెం గడీమీదకు వెళ్లాలి" అన్నాడు.

రూబేను తలూపాడు. "సరేలే దొరా" అన్నాడు. రూపాయల కట్టలన్నింటినీ తీసి భద్రం చేసుకున్నాడు.

"అన్నట్టు మర్చిపోయాను. ఎర్రగూడెం గడీలో మిలట్రీ కాపలా ఉందిగదా దొరా" అన్నాడు తిరిగి.

"అది మీకెందుకోయ్. అదంతా నేను చూసుకుంటాను. అక్కడి జమీందారు నాకు బాగా తెలిసినవాడు. వాడికొక భాగం పారేస్తే మనం వెళ్లగానే తప్పుకుంటారు"

"అయితే ఆ రోజు తమరు రావాలికదా"

"వస్తాలే. కానీ ఈసారి యానాదులతో గట్టిగా చెప్పు. అచ్చు సంగంవాళ్ల మాదిరిగానే ప్రవర్తించాలి. తెలిసిందా?"

రూబేను తలూపాడు. "ఈసారి అట్లా జరగకుండా వాళ్లతో గట్టిగా చెప్తాలే దొరా" అన్నాడు.

"సరే ఇక నీవు వెళ్లిరా" అన్నాడు పటేలు.

రూబేను లేచి చీకటిలో వెళ్లిపోయాడు. పటేలు కొవ్వొత్తిని ఆర్పివేశాడు. మరుక్షణమే ఆ ప్రాంతమంతటా గాఢాంధకారం కమ్ముకుంది. రెండు నిముషాల పాటు చడీచప్పుడు లేకుండా కూర్చున్నాడు. తర్వాత మొలలో నున్న కత్తిని బయటికి లాగి చెట్టు మొదట్లో గుర్తుగా గుంట తవ్వనారంభించాడు.

తిరిగి నాలుగు నిమిషాలు గడిచిపోయినయ్. సమీపంలోనే అడుగుల చప్పుడు వినిపించింది. తలెత్తి చూశాడు. రెండు ఆకారాలు ఎదురుగా నిలబడి ఉన్నాయి. వెంటనే అతడి గుండెలు గుభేలుమన్నాయి.

అంతలోనే ఆ ఆకారాల్లో ఒకటి పకపకా నవ్వడం వినిపించింది. "పటేల్‌సాబ్ మాకీ తెల్వకుండా గడీలో దోపిడీచేసి డబ్బూ, దస్కం దాస్కుంటుండవు?" అన్న మాటలు వినిపించినయ్. ఆ మాటలు బడేమియావి అని గుర్తించాడు. ఎటూ తోచక లేచి నిల్చున్నాడు.

అంతలోనే బడేమియా తిరిగి నవ్వాడు. చేతిలోనున్న లైటును పటేలు ముఖంలోకి వేశాడు. "పటేలు సాబ్, మాకూ దోఖా ఇచ్చినవుగదూ?" అన్నాడు.

పటేలు వచ్చీరాని నవ్వును పెదవులపైకి తెచ్చుకున్నాడు. "బడేమియాగారూ, మీకు దోఖా ఇవ్వగలనా చెప్పండి" అన్నాడు.

"అరె ఇదీ హేమ్టయా? దోఖాగాదూ? మీకీ తెల్వకుండా మేం, మాకీ తెల్వకుండా మీర్ తినకూడదు. దీన్నీ మాది శాస్తరం సమ్మతి చెయ్యదు"

"ఇంతలోనే నేనేం తిన్నానంటారు?"

"తినలేదు. కానీ అసల్‌మాకీ విషయం చెప్కా చేసినవు?"

"రేపు ఉదయం మీ అందరితోనూ చెప్దామనుకున్నాను"

పకపకా నవ్వాడు బడేమియా. పటేలు వీపుపై చేయివేసి నిమిరాడు. "హేమి మాటల్ చెప్తున్నావు పటేల్‌జీ" అన్నాడు. వెనుకగాఉన్న హుసేనువైపుకు తిరిగాడు. "హుస్సేన్ ముందుకువచ్చి నగలమూటను ఎత్తుకున్నాడు. పటేల్ తెల్లమొగం వేసి చూస్తూ నిలబడ్డాడు.

"పటేల్‌జీ ఇంట్కీ పోదాం పద" అన్నాడు బడేమియా. పటేలు మాత్రం లోలోపల ఎంతగానో బాధపడ్డాడు. చేసేదేమీలేక వారిద్దరివెంట ఇంటికి బయల్దేరాడు.

✳✳✳

సాయంత్రం రెండు బారల పొద్దుంది. రాముడి కొండ నెత్తిన ఉన్న బూరుగు వృక్షం నీడన సంగం వాళ్లందరూ సమావేశమై కూర్చున్నారు. వారిమధ్య తీవ్రమైన చర్చలు సాగుతున్నాయి.

"ఇందులో ఏమాత్రం ఆలోచించవలసిన పనిలేదు. రజాకారుల వల్లనే ఈ దోపిడీ జరిగింది" అన్నాడు యాదవరెడ్డి.

ప్రతాప్‌రెడ్డి తలూపాడు. "దీనివలన నిజంగానే సంగంవాళ్లు దోపిడీలు సాగిస్తున్నారని ప్రజలు అనుకుంటారు కూడా" అన్నాడు.

"ఇది మన సంగానికి తీరని కళంకం" అంది ప్రమీలాదేవి.

"ఈ దోపిడీలు ఎవరివల్ల జరుగుతున్నట్లో తెలుసుకుని దోపిడీ నాయకులను బంధించి ప్రజలముందు పెట్టి శిక్షించాలి. లేకపోతే ప్రజలు మనల్ని వూరికే అనహ్యించుకుంటారు" అన్నాడు చెన్నారెడ్డి.

"నిజమే మరి, ఆలస్యమెందుకు? ఆ దోపిడీ దొంగలు ఎవరయిందీ తెలుసుకుని బందించివేద్దాం. బయల్దేరండి" అన్నాడు కామారెడ్డి.

ప్రతాప్‌రెడ్డి నవ్వాడు. "మనం ఊరికే త్వరపడడం తగదు. మల్లారెడ్డిని ప్రత్యేకంగా ఇందుకోసమేగదా పంపాం. అతడు కొంతవరకు నిజం తెలుసుకుని వస్తాడు. అతడికోసం ఎదురుచూద్దాం" అన్నాడు. అతడి మాటలకు అందరూ తలలూపారు.

"మల్లారెడ్డి ఉదయం అనగా బయల్దేరివెళ్లాడు. అతడింతవరకు రాకపోవడం సందేహంగా ఉంది" అన్నాడు యాదవరెడ్డి.

"నిజమే మల్లారెడ్డి ఎక్కడయినా చిక్కుల్లో పడ్డాడేమో" అన్నాడు చెన్నారెడ్డి.

"మీరేమీ ఆదుర్దా పడకండి. మల్లారెడ్డికి ఎటువంటి భయంలేదు. వేషం వేసి మాటమార్చి మాట్లాడడంలో మహానేర్పరి. అదీగాక ఆపద సమయంలో ప్రాణాలను కాపాడుకోవడానికి తగిన ఆయుధం గుప్తంగా భద్రపర్చుకుని మరీ వెళ్లాడు" అన్నాడు ప్రతాప్‌రెడ్డి.

అంతలోనే డేంజరు కూత వినిపించింది. అది విని అక్కడి వాళ్ళంతా దిగ్గున లేచి నిల్చున్నారు. ఎవరి ఆయుధం వారు తీసుకుని ఆదుర్దాగా దిక్కులు పరికిస్తున్నారు. ప్రతాప్‌రెడ్డి మాత్రం సమీపంలో ఉన్న వేపచెట్టు వద్దకు వెళ్ళాడు. వేపమాను కొమ్మల్లో సెంట్రీగా ఉన్న కృష్ణారెడ్డిని పిలిచాడు. "క్రిష్ణా ఏమిటది?" అనడిగాడు.

చివరి కొమ్మల్లో కూర్చున్న కృష్ణారెడ్డి కొండ దిగువ భాగం వైపుకు చూపులు సారిస్తున్నాడు. "ప్రతాప్, మనం వున్న కొండవైపుకు ఇద్దరు మనుషులు వడిగా నడచి వస్తున్నారు" అన్నాడు.

"ఇద్దరేనా? వాళ్లు ఎవరైఉంటారు? బాగా చూడు కృష్ణా" అన్నాడు ప్రతాప్‌రెడ్డి.

"సరిగా కనిపించడం లేదు ప్రతాప్, వారిద్దరూ రోడ్డు దాటి కొండదాపులోని చెట్లగుంపులో ప్రవేశించారు" అన్నాడు కృష్ణారెడ్డి.

వెంటనే యాదవరెడ్డిని పిలిచాడు ప్రతాప్‌రెడ్డి. అతడి చెవిలో ఏమేమిటో రహస్యంగా చెప్పాడు. తర్వాత యాదవరెడ్డి కొంతమందిని వెంట తీసుకుని కొండదిగువ ప్రదేశానికి చరచరా దిగి వెళ్లిపోయాడు.

ప్రతాప్‌రెడ్డి తుపాకిని చంకకు తగిలించుకుని వేపమాను చివర కొమ్మలకు ఎగబాకాడు. అతడితోపాటు ప్రమీలాదేవి కూడా చివర కొమ్మలకు చేరుకుంది. "కృష్ణా ఆ మనుషులెక్కడా?" అడిగాడు



ప్రతాప్‌రెడ్డి.

"ఆ కనిపిస్తోన్న గుంపుచెట్లలోకి ఇప్పుడే ప్రవేశించారు ప్రతాప్" అన్నాడు కృష్ణారెడ్డి.

ప్రతాప్‌రెడ్డి, ప్రమీలాదేవి ఇద్దరూ చెట్లగుంపువైపుకు సూటిగా చూస్తున్నారు. రెండు నిమిషాలు గడిచిపోయాయి.

"అదుగో ప్రతాప్, ఇద్దరు కొండపక్కగా ఎక్కివస్తున్నారు" అన్నాడు కృష్ణారెడ్డి.

"అవును" అంటూ తలూపాడు ప్రతాప్‌రెడ్డి.

"అవును, కానీ ఆ ఇద్దరూ అనుమానించవలసిన వాళ్లుగా లేరు" అంది ప్రమీలాదేవి.

"మీ మాట నిజం ప్రమీలాదేవి. వాళ్లిద్దరూ అచ్చు రైతుల మాదిరిగా కనిపిస్తున్నారు" అన్నాడు ప్రతాప్.

"రజాకార్లు గాని వేషాలు మార్చి వేగులకోసం వస్తున్నారేమో?" అన్నాడు కృష్ణారెడ్డి.

ప్రతాప్‌రెడ్డి నవ్వాడు. "రజాకార్లా? వాళ్లు రావడం కల్ల. వాళ్లు ఎన్నివేల గుండెలున్నా యీ కొండదాపుల్లోకి రాలేరు" అన్నాడు.

"అయితే మరి వాళ్లెవరై ఉంటారు ప్రతాప్?" అన్నాడు కృష్ణారెడ్డి.

"చుట్టుపక్కల పల్లెలవాళ్లు అయ్యుంటారని పిస్తోంది" అన్నాడు ప్రతాప్.

"దాదాపు ఇప్పుడు పొద్దుగూక వస్తోంది గదా? పల్లెలవాళ్లు ఈ వేళప్పుడు కొండకు వస్తారా?" అంది ప్రమీలాదేవి.

"అదీ నిజమే. పల్లెవాళ్లు ఉదయం కొండకు వచ్చి పనులు చేసుకుని సాయంత్రానికల్లా ఇళ్లకు వెళ్లిపోతుంటారు" అన్నాడు ప్రతాప్.

ఈ విధమైన సంభాషణ వాళ్ళ మధ్య సాగుతోంది. అర్ధగంట గడిచిపోయింది. యాదవరెడ్డి, ప్రతాప్, ప్రమీలా ఇద్దరూ చెట్టు దిగారు.

"వాళ్లు మన గ్రామంవాళ్లే ప్రతాప్" అన్నాడు యాదవ.

"మన గ్రామం వాళ్లా?" ప్రశ్నించాడు ప్రతాప్.

"అవును ప్రతాప్. మా బ్రహ్మారెడ్డి మావయ్య, పెద్దమాదిగ పెంటయ్య ఇద్దరూ వచ్చారు" అన్నాడు యాదవ.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

కె శివలీల



క్లాస్ రెప్

"**నీ**రజా! మేడం వస్తారా రారా?!"

"వెళ్లు, విషయమేంటో తెలుసుకుని వెంటనే మాకు చెప్పు..."

"అరె కదులు తల్లీ... నువ్వేదోకటి తేల్చితే లైబ్రరీకెళ్లాలో క్యాంటీన్‌కెళ్లాలో మేం డిసైడ్ చేసుకోవాలి కదా..."

ఎందుకు వీరంతా ఆ అమ్మాయినలా కంగారు పెడుతున్నారు? వాళ్లే వెళ్లి కనుక్కోవచ్చుగా... ఇదే ప్రశ్న వారినడిగితే... "మాకా అవసరం లేదు. మా పరిధి క్లాస్‌రూంగోడల వరకే..." అని తేల్చిచెబుతారు. "అయినా మీరేంటి సంగతేంటో తెలుసుకోకుండా ఆ అమ్మాయి తరపున వకాల్తా పుచ్చుకుంటున్నారు?" అని నిలదీస్తారు. "ఎనీ పర్సనల్ ఇంటరెస్ట్..." అంటూ ఆరాదీస్తారు కూడా.

మరి ఆ అమ్మాయి ఫీలింగ్స్...

"అయ్యయ్యో తొందరపడి వాళ్లనేం తిట్టకండి... ఎందుకంటే... వాళ్లంతా నా స్నేహితులు... వాళ్ల విషయాన్ని గుర్తుతెచ్చుకునేది క్లాస్ అవర్స్ పూర్తయిన తర్వాతే. మరి క్లాసుటైమింగ్స్‌లోనేమో నన్ను సైతానుల్లా వేధిస్తారు... రాబందుల్లా నన్ను పీక్కుతింటారు. నేనూ వారిలాంటిదాన్నే అన్న విషయాన్ని ఎందుకు మర్చిపోతారు? వీరిని మానేజ్ చేయడమెలా... నో యూజ్... ఎంత ఆలోచించినా సమాధానం దొరకదే"

"నీరూ డియర్... క్విక్... టైం వేస్ట్ చేయకు..." ఖంగుమన్న కంఠం విని ఉలిక్కిపడ్డాను. అసలే ఎగ్జామ్స్ టైం... ప్రొఫెసర్ని పిలవకపోతే వీళ్లు నన్ను బతకనివ్వరు... అనుకుంటూ డిపార్ట్‌మెంట్ లైబ్రరీ దిశగా అడుగులేశాను.

టూల్స్ అండ్ టెక్నిక్స్ ఆఫ్ ఎడిటింగ్... బుక్ టైటిల్ స్పష్టంగా కనిపిస్తోంది. దానివెనుక ఉన్న ప్రొఫెసర్ మొహం ఎంత గంభీరంగా ఉంటుందో ఊహించగలను. బుక్ రిఫర్ చేస్తున్న సమయంలో డిస్టర్బ్ చేస్తే పర్యవసానం ఏవిధంగా ఉంటుందో నాకు విదితమే. ఏం చేస్తాం? రోటిలో తలపెట్టాక రోకటి పోటుకు జడవడమా... కుదరదుగా అనుకున్నాను. ధైర్యం చేశాను.

"ఎక్స్‌క్యూజ్‌మీ మామ్..."

ఆవిడ చురుగ్గా కళ్లెత్తి చూశారు. ఆ చూపులకు నా పైప్రాణాలు పైనే పోయాయి. "మామ్... విల్ యూ కమ్ టు..." నా మాటలు బయటికొచ్చాయో లేదో... "ఏంటమ్మా... ప్రతి అవర్‌కూ నువ్వొచ్చి గుర్తుచేయాలా? అంటే మాకు మతిమరుపనా నీ ఉద్దేశ్యం...? రోజూ నీతో ఒక తలనొప్పయిపోతోంది. వస్తున్నాను వెళ్లు..." కయ్యిమందా ప్రొఫెసర్.

డిపార్టుమెంట్లో ఉన్న లెక్చరర్స్, రీడర్స్ నావంకే కుతూహలంగా చూస్తున్నారు. నేను నిలువు గుడ్లేసుకుని అలా చూస్తుండిపోయాను. ఇంకా ఏం కావాలి? గద్దించిందామె స్వరం. అప్పుడు గుర్తొచ్చింది నేనామెనలానే చూస్తూ అక్కడే నిల్చుండిపోయానన్న సంగతి. 'సారీ మామ్' అని అక్కడ్నుంచి కదిలాను.

ఎందుకీ అమ్మాయిని అటు క్లాస్‌మేట్స్, ఇటు ప్రొఫెసర్స్ లెఫ్ట్ అండ్ రైట్ వాయిస్తున్నారు అనుకుంటున్నారా? మీరే ఇంతలా బాధపడితే మరి నీరజ సంగతో... "అనవసరంగా క్లాస్‌రెప్‌గా నిల్చున్నాను. భరించక తప్పదు" ఇలా అనుకోవడం ఈ ఆర్నెల్లలో కొత్తేం కాదు. ఇంత బాధపడడం దేనికి. రాజీనామా చేస్తే పోలా... ఇదే మీ మనసులోనూ ఉంది కదూ... ఆ ప్రయత్నాలూ అయ్యాయి. కానీ ఆ రాక్షసులు అంటే నా క్లాస్‌మేట్స్ పడనిస్తేనా? నేనే క్లాస్ రెప్రజెంటేటివ్‌గా ఉండాలని అందరూ బల్లగుద్ది మరీ చెప్పారు. ఇక మా ప్రొఫెసర్ సంగతి సరేసరి. మాస్ కమ్యూనికేషన్ స్టూడెంట్‌వి ఆ మాత్రం రిలేషన్స్ మెయిన్‌టెయిన్ చేయకపోతే ఎలా... రేపు ఏ కంపెనీకో పిఆర్‌ఓగా వెళ్లావనుకో... అక్కడ ఎంప్లాయీరిలేషన్స్ సంగతేంటి? ఇప్పట్నించే నీవు అలవాటు చేసుకోవాలి. తప్పదు... అయినా వీళ్లేమైనా అంటున్నారా నిన్ను? నీకేమైనా ఇబ్బందివస్తే నాతో చెప్పు... అంతేగానీ అలా బెంబేలుపడకు..."

ఆమె... మంచి బూస్టర్... ఆమె మాటలు వింటున్నంతసేపూ... నాగస్వరం విన్న తాచులా అయిపోయాన్నేను. యూనివర్సిటీ ఒక ఆర్గనైజేషన్ అయినట్టూ... నేనో పిఆర్‌ఓ అయినట్టూ.... క్లాస్‌మేట్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ మధ్య సత్సంబంధాలు నెలకొల్పాల్సిన బాధ్యత నాచేతుల్లో ఉన్నట్టూ... ఏవో పిచ్చి ఊహలు... ఆ అవర్‌లో వాళ్లేం అల్లరీ చేయలేదు. యూ ఆర్ ఎ గుడ్ కమ్యూనికేషన్ ఆఫీసర్ అని నాకో కితాబు ఇచ్చేస్తున్నారు కదూ... నేనూ ఆ క్షణం అలానే గర్వించాను. ఆ ఊహతోనే నా మనసు పులకించిపోయింది. "వాళ్లందరూ ఓ సంవత్సరంన్నర తరువాత ఇంటర్న్ షిప్ చేస్తారు... నీకిది ఇప్పట్నించే ఒక ట్రయినింగ్. వాళ్లను బేర్ చేయగలిగితే ఆర్గనైజేషన్‌ను సులభంగా నడిపించొచ్చు" ప్రొఫెసర్ చెప్పిన మాటలు లీలగా వినిపించాయి. మంచి హుషారునిచ్చాయి.

ఆ తరువాత రోజు...

"నీరజా ఈ పాయింట్స్ కాస్త చెబుతూ ఉండు... నేనిప్పుడే వస్తాను" అంటూ మేడం ఒక మెటీరియల్ ఇచ్చింది. నేను చెప్పడం మొదలుపెట్టానో లేదో... "ఏంటీ...", "ఇంకోసారి చెప్పు", "స్పెల్ అవుట్ ఇట్.." ఇదీ మాక్లాస్‌మేట్స్ వరస. మేడం చెబుతుంటే నోర్మూసుకుని రాసుకునే వాళ్లు... నా దగ్గర మాత్రం కల్లు తాగిన కోతులే అయ్యారు. టెక్నికల్ వర్డ్స్ బోర్డు మీద రాస్తే సరి అనుకుంటున్నారు కదా... నేనూ అదే చేశాను. "ఇంకొంచెం పెద్దగా రాయొచ్చుగా..." "కోడిగీతల్లా ఉన్నాయేంటో..." వెనకనుంచి వినిపిస్తున్న మాటల తూటాలు... ఆ గంటసేపూ నాకొక యుగంలా గడిచింది.

క్లాస్ టైంకు పదినిమిషాలు ముందే హాజరవ్వాలి. కర్మఖాలి లేటయిందా గుమ్మంముందే ప్రొఫెసర్‌తో సహా క్లాస్‌మేట్స్ దర్శనమిస్తారు. వారి చూపులసంగతి సరేసరి. అటెండెన్స్, చాక్‌పీస్ వగైరాల బాధ్యతలన్నీ నా మీదే... కాలేజీ బంక్ కొట్టడానికి ఆస్కారమే లేదు. రేపు ర్యాలీ చేయాలి అని అనౌన్స్ చేశారనుకోండి... తప్పించుకోవడం సంగతలావుంచి తప్పించుకు తిరుగుతున్న వారిని పట్టుకుని మరీ ర్యాలీ చేయించాలి. బ్యానర్లు తయారుచేయాలి. ఫండ్స్ కలెక్ట్ చేయాలి. ఒక్కమాటలో చెప్పాలంటే లీడర్‌షిప్ స్కిల్స్ చక్కగా అలవాటవుతాయి అంటోంది నీరజ. ఎన్ని కష్టాలు... అని వాపోతున్నారా? మరి నాయకత్వ లక్షణాలు అలవాటు చేసుకోవడమంటే మాటలా ఏంటి?



సినీ రచయిత

శ్రీ పరుచూరి గోపాలకృష్ణ

చెప్తోన్న కబుర్లు

దర్శకులుగానూ విజయం సాధించాం

చందు

బాలీవుడ్ తరహాలో మాక్కూడా సీక్వెల్స్ రావాలన్న ఆశ ఉంది. 'బొబ్బిలి బ్రహ్మన్న-2', 'ఖైదీ-2' తీయాలన్న కోరిక కలిగింది కానీ ఎవరూ ముందుకురాలేదు. ఈ రెండు చిత్రాల సీక్వెల్స్‌కి సంబంధించిన అద్భుతమైన మేటర్ మాదగ్గరుంది.

తొమ్మిదింటిలో నాలుగు వంద రోజుల చిత్రాలున్నాయి

మేం దర్శకత్వం వహించిన 'రేపటి స్వరాజ్యం' వందరోజులాడింది. 39 కేంద్రాల్లో 'ప్రజాస్వామ్యం' విడుదలైతే అన్ని కేంద్రాల్లోనూ అర్ధ శతదినోత్సవాన్ని పూర్తిచేసుకుంది. సగం థియేటర్లలో శతదినోత్సవాన్ని జరుపుకుంది. అలాగే 'సర్పయాగం', 'భలే తమ్ముడు' చిత్రాలు. కాకపోతే మేం ఇండస్ట్రీకొచ్చిన తొలినాళ్ళలో సక్సెస్ చేయాలనుకున్న కొన్ని సబ్జెక్ట్స్ ఫెయిలయ్యాయి. సీలింగ్ యాక్ట్ మీద తీసిన 'కాయ్ రాజా కాయ్', వరకట్నం మీద తయారుచేసుకున్న 'కట్న లీలలు' నిరాశపరిచాయి. ఇవన్నీ అభ్యుదయభావాలవే. ఈ సిద్ధాంతాలకు కట్టుబడి ఇంకా సినిమాలు తీస్తున్నది నారాయణమూర్తే. తొమ్మిది సినిమాలకు దర్శకత్వం వహిస్తే అందులో వందరోజుల చిత్రాలు నాలుగుంటే దర్శకులుగా సక్సెస్ అయినట్లు కాదా? 50శాతం విజయం సాధించడం మామూలు మాట కాదు కదా! ఈ రకంగా దర్శకులుగా సక్సెస్ సాధించాం.

మామీద ఇద్దరు థీసిస్ చేస్తున్నారు. పరుచూరి బ్రదర్స్‌మీద థీసిస్ చేసే పరిస్థితి వచ్చిందంటే మేం రాసిన రచనలో ఏదో ఉన్నట్లు ప్రపంచం విశ్వసిస్తున్నట్లే కదా!

మెసేజే ఇవ్వాలనుకుంటే డాక్యుమెంటరీ తీస్తే సరిపోతుంది

'ఠాగూర్', 'శంకర్‌దాదా ఎం.బి.బి.యస్', 'ఇంద్ర', 'స్టాలిన్' చిత్రాల్లో ఎంతోకొంత సామాజిక చైతన్యం చూపించాం కదా... ఒక్క మెసేజే ఇవ్వాలనుకుంటే కోట్లు పెట్టి సినిమా తీయనక్కర్లేదు. 10 లక్షలతో డాక్యుమెంటరీ తీస్తే సరిపోతుంది. 'మీరు మెసేజే ఇవ్వాలనుకుంటే ఒక టెలిగ్రామ్ ఇస్తే సరిపోతుంది' అని హాలీవుడ్ మేధావి అన్నారు.

దూరంగా ఉన్నామన్న భయంతో తెలుగును కాపాడుకుంటున్నారు

తెలుగు భాషా సంఘం అధ్యక్షునిగా 14 నెలలున్నాను. ప్రభుత్వం మారడంతో రాజీనామా చేశాను. తెలుగు పరిస్థితి దిగజారిపోవడానికి కారణమేంటని నన్నడిగితే... ఒక్క ప్రభుత్వంమీదే నిందవేయను. ప్రజలక్కూడా ఇందులో భాగముంది. మీ అమ్మంటే మీకిష్టం. మీ నాన్నంటే మీకిష్టం. మరి మీ అమ్మ భాషంటే ఎందుకు ఇష్టం లేదు. రెండు రూపాయలకు కిలో బియ్యం అడుగుతున్నారుగానీ తెలుగు అడగడంలేదు. ఉచిత కరెంట్ అడుగుతున్నారుగానీ తెలుగు చదివిన మా అబ్బాయికి ఉద్యోగం ఇస్తాననవయ్యా... తెలుగు చదివిస్తాననడంలేదు. మొదటి తప్పు ప్రజలది. ఇక రెండో తప్పు ప్రభుత్వ అధికారులది. నామ ఫలకాలన్నీ ఇంగ్లీషులోనే ఉంటున్నాయి. ఎ.పి. జెన్‌కో, ఎ.పి. ట్రాన్స్‌కో అని పెట్టారు. పేరు మార్చమని నేను అధికార భాషాధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఎన్ని పర్యాయాలు లేఖలు రాశానో అక్కడ సోదా చేస్తే తెలుస్తుంది. 'విద్యుత్ ఉత్పాదక సంస్థ', 'విద్యుత్ ప్రసార సంస్థ' అని తెలుగు పేర్లు కూడా సూచించాను. 'విద్యుత్' అనే పదం అలవాటైందే కదా. మరి కరెంట్ బదులు అది వాడొచ్చుగా! వీధి, బాట, రహదారి పోయి రోడ్డు అని అలవాటు చేసేశాం. ఇలా రెండువేల పదాలదాకా దూరేశాయి. మన నోట్లోకి కాదు, నెత్తుర్లోకి. అనవసరంగా ఎందుకు గొడవ పెట్టుకుంటావని అనాల్సిందిపోయి, 'అన్నెససరి'గా ఎందుకు గొడవ అంటున్నారు. 'అనవసరం' లోంచి 'అన్నెససరి' వచ్చిందని తెలియదు. ఇండో-ఆర్యన్ భాషలన్నీ సంస్కృతంలోంచి వచ్చినవే. 'మాతృ' నుంచి మదర్, 'భ్రాతృ' నుంచి బ్రదర్ 'పితృ' నుంచి ఫాదర్... ఇలా సంస్కృతంనుంచి వచ్చినవే. నా హయాంలో సామాజికంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని చిరంజీవి, బాలకృష్ణ, కృష్ణ... ఇలా అనేకమంది ప్రజాభిమానం కలిగినటువంటి వెండితెర వెలుగులతో తెలుగులో మాట్లాడమని జెమిని టీవీ ఛానల్‌ద్వారా చెప్పించాను. చిరంజీవిగారు రక్తదానం చేయమంటే చేస్తున్నారు. నేత్రదానం చేయమంటే చేస్తున్నారు. ఇట్లాగే మన హీరోలు చెబితే కనీసం అభిమానుల్లోనైనా సామాజిక చైతన్యం కొంత వస్తుందని చెప్పించాం. గతంలో అధికార భాష తరపున ఏదైనా సాంస్కృతిక కార్యక్రమం జరిగితే అవధానమో, కవితా సమ్మేళనమో నిర్వహించేవాళ్ళు. నా ఆధ్వర్యంలో సరికొత్త పోటీ నిర్వహించాం. మూడు నిమిషాల్లో ఆంగ్ల పదం ఉపయోగించకుండా మాట్లాడండి అని పోటీలు నిర్వహించి గెలిచినవాళ్ళకి బహుమతులు ఇప్పించాం. ఆ బహుమతులు కూడా తెలుగు సాహిత్యానికి చెందిన పుస్తకాల రూపంలోనే అందించాం. అలాంటి పుస్తకాలను ఎలాగూ కొనరు కాబట్టి ఈ రకంగానైనా చదువుతారని అలా చేశాం. అమెరికాలోని డెట్రాయిట్ నగరంలో కూడా ఈ పోటీలు నిర్వహించినప్పుడు నిశ్చేష్టతకు గురిచేసిన విషయం ఏమంటే... మన రాష్ట్రంలో ఎవరూ మూడు నిమిషాలపాటు ఆంగ్ల పదం లేకుండా నిండుగా మాట్లాడలేకపోయారు. కానీ డెట్రాయిట్‌లోని తెలుగువారు మాట్లాడారు. అప్పుడు నాకనిపించింది. తెలుగుదేశానికి దూరంగా ఉన్నామన్న భయంతో తెలుగును కాపాడుకుంటున్నారు వాళ్ళు. తెలుగునాట ఉన్న మనం తెలుగుని విస్మరిస్తున్నాం అని.

నవ్వించడం తేలిక, ఏడిపించడం కష్టం

నూటికి నూరుశాతం సెంటిమెంట్ రాయడమే కష్టం. ప్రేక్షకుల్ని నవ్వించడం తేలిక. ఏడిపించడం చాలా కష్టం. మహా నటుడు రేలంగి మొదటి ఫ్రేమ్‌లోనే నవ్వించగలడు. మహానటి సావిత్రి తొలి ఫ్రేమ్‌లో ఏడిపించలేదు. ఆవిడ కథేమిటో, పడుతున్న కష్టమేమిటో తెలియాలి. అప్పుడామె మాట్లాడితే ఏడుపొస్తుంది. సెంటిమెంట్ చాలా కష్టమైంది. పండించడం కూడా చాలా కష్టం.

ఈ విధానంలో పేదవాడు బతకడం కష్టం

కూడు, గుడ్డ, గూడు. ఎన్.టి.ఆర్.గారు చెప్పినట్లు ఈ మూడూ మానవుని కనీసావసరాలు. ఇవి సమకూరిననాడు ఇన్ని దుర్మార్గాలుండవు. ఒక మనిషి కోట్ల రూపాయిలు సంపాదించుకోడానికి అవకాశం ఉన్నటువంటి ఈ విధానంలో పేదవాడు బతకడం కష్టం. నువ్వింతకంటే ఎక్కువ ఉంచుకోవడానికి వీల్లేదనే విధానం ఉంటే అక్కడితో సంపాదించడం మానేస్తాడు.

ఆ కాగితాలు చూస్తే తెలుస్తుంది డబ్బంతా ఎక్కడికి వెళ్ళిందో

పరుచూరి సోదరుల మూలంగా ఎంతమంది ఆర్టిస్టులు, రచయితలు, దర్శకులు ఇండ్రస్ట్రీలోకి వచ్చారో కళ్ళు మూసుకుని ఆలోచిస్తే పరిశ్రమలో అందరికీ అర్థమవుతుంది. అలాగే పరుచూరి బ్రదర్స్ మూలంగా ఎంతమంది విద్యార్థులు చదువుకున్నారో... ఎంతమంది సహాయం పొందారో... ఇవన్నీ మేం ఇన్‌కమ్ టాక్స్‌కి సబ్‌మిట్ చేసిన కాగితాలు చూస్తే తెలుస్తుంది మా డబ్బంతా ఎక్కడికి వెళ్ళిందో.

ఆ ఇద్దరూ నా ఆరాధ్య దైవాలు

అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ నేను ఆరాధించేది ఇద్దరినే. ఒకరు పుచ్చలపల్లి సుందరయ్యగారు, రెండు ఎన్.టి.ఆర్.గారు. సుందరయ్యగారిని రాజకీయవేత్తగా, రామారావుగారిని నటుడిగా ఆరాధించాను. పుచ్చలపల్లి సుందరయ్యగారి జీవితచరిత్ర చదివి ఉద్యోగం పొందాను కాబట్టి, రామారావుగారు రాజకీయాల్లోకి వచ్చాక పేదవాడికోసం ఆయన పడ్డ తాపత్రయం పక్కన కూర్చొని చూశాను కాబట్టి ఇద్దరూ చెరో కన్ను అనుకున్నాను. ఆ ఇద్దరు మహానుభావుల ప్రేరణ అనుక్షణం మనసులోకి, మస్తిష్కంలోకి వస్తూ ఉంటుంది. ✤

బాలనేస్తాలు

పేపర్ వెయిట్

క్రాంతి

హాయ్ ఫ్రెండ్స్! పోయిన వారం మనం చెప్పుకున్న రంగు రంగుల కోడిగుడ్లను చేసి చూశారా? ఈ వారం పిల్లలు, పెద్దలు అందరికీ ఉపయోగపడేలా ఓ గిఫ్ట్ తయారుచేద్దాం. ఆ క్రిస్మస్ గిఫ్ట్ ఏంటో తెలుసా? పేపర్ వెయిట్. దీన్ని ఎలా తయారుచేయాలో చెప్పకుందామా! మరైతే చకచకా చదివెయ్యండి.

పేపర్ వెయిట్ తయారీకి ఏమేం కావాలంటే...

కాస్త పెద్దగా, గుండ్రంగా వున్న రాయి, రంగులు, రంగులు వేసే బ్రష్, రంగు కాగితం, పెన్సిల్, కత్తెర, గమ్.

ఎలా చేయాలంటే...

①

ముందుగా రాయికి ఎరుపు, ఆకుపచ్చ, పసుపు... ఇలా మీకిష్టమొచ్చిన రంగు వేయండి. రంగు పూర్తిగా ఆరిపోయిన తర్వాత దాని మీద నక్షత్రాల బొమ్మలు వేయండి. అయితే రాయి మొత్తం నక్షత్రాలతో నింపకుండా ఓ పక్కన కాస్త ఖాళీ అట్టిపెట్టండి. ఇది ఎందుకంటే... మీరు ఎవరికైతే బహూకరిస్తున్నారో వాళ్ల పేరు రాయడానికి అన్నమాట. ఇప్పుడు నక్షత్రాలను మీకు నచ్చిన రంగులతో నింపండి. రంగు రంగుల నక్షత్రాలున్న పేపర్ వెయిట్ రెడీ. అయితే దీన్ని కాగితం పువ్వుతో ఇంకాస్త అందంగా అలంకరించవచ్చు.

②



అదెలాగంటే...

రంగు కాగితం మీద పెన్సిల్‌తో పెద్ద సున్నా గీయండి. కత్తెరతో అంతవరకు కత్తిరించండి. ఇప్పుడు కాగితం వృత్తాకారంలో వుంది కదూ. ఇప్పుడు దీని మధ్యలో ఓ చిన్న సున్నా గీయండి. ఆ చిన్న సున్నా దగ్గర్నుండి కాగితం చివరి వరకు గీతలు గీసి, కత్తెరతో కత్తిరించండి. (2వ బొమ్మ చూడండి). కత్తిరించిన కాగితం ముక్కలన్నీ పూరేకుల్లా కిందకు వేలాడుతున్నాయి కదూ. ఇప్పుడు ఈ కాగితం పువ్వు మధ్యలో గమ్ రాసి, పేపర్ వెయిట్ మీద అంటించండి. బాగా ఆరిన తర్వాత దాని మీద మీ ఫ్రెండ్ పేరు రాసి, బహూకరించండి. సరేనా!

③



✶

ఎక్కడికి?

నేస్తాలూ...కింది బొమ్మలో సైనికులు ఎక్కడికో వెళుతున్నా... ఇంతకీ వాళ్లు వెళ్లేది ఎక్కడికబ్బా... తెలియాలంటే... కింద చక్రంలో ... బొమ్మలున్నాయికదా. వాటి మొదటి అక్షరాన్ని వరుసగా రాయ... తెలిసిపోతుంది.



జవాబు

1.octopus 2.nurse 3.tortoise 4.horse 5.eye 6.whistle 7.apple 8.rat 9.parrot 10.axe 11.tap 12.hundred (on the war path).అంటే యుద్ధపథంలోకి వెళుతున్నారు.

డబల్యూలో ప్రయాణం చేస్తారా

లోపలికి

హాయ్! పైన ఆంగ్ల అక్షరం డబల్యూ వుంది... మీరేం చేయాలంటే.... సరదాగా ఇందులో ప్రయ... చేసి బయటకు రావాలి. చూశారుగా... అడ్డంకులున్నాయో! మీరు సరైనద... ఎలా వస్తారన్నది మీ తెలివితేటలప... వుంటుంది. బెస్టాఫ్...

చిన్నారి చిత్రకారులు



బొమ్మలో భామ

చిన్నారులూ.... పక్క బొమ్మలో మీకు ఏం కనిపిస్తోంది? ఒక చెట్టు. చెట్టు తొర్రలో పక్షిగూడు. అందులో రెండు పక్షి పిల్లలు. అమ్మానాన్న తెచ్చే ఆహారం కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నాయికదూ. మీరు ఇంకా వరిశీలనగా చూస్తే...మరో దృశ్యంకూడా కనిపిస్తుందర్రా....అదేంటో చెప్పమంటారా! ఆ...ఇప్పుడు ఈ పుస్తకాన్ని కాస్త దూరంగా పెట్టుకుని చూడండి. ఏం కనిపిస్తోంది? అందమైన అమ్మాయి మొహం సగం కనిపిస్తోందికదూ.

మల్లి అప్పారావు,
10వ తరగతి,
తిప్పలవలస (పోస్ట్),
కొత్తూరు (గ్రా),
పూసపాటిరేగ (మం),
విజయనగరం జిల్లా.

ఎస్.బాలకృష్ణ, 6వ తరగతి,
నవోదయ మోడల్ స్కూల్,
సీతపేట రోడ్డు దగ్గర,
పాలకొండ.

సిహెచ్ శివచంద్ర, 8వ తరగతి,
కత్తిపూడి, తూర్పు గోదావరి జిల్లా.





ఆరు తేడాలు కనుక్కోండే

అట్టమీది కథ

లేఖా గుమ్మడి

బొగ్గుగనుల కార్మికులు, క్రూడ్ ఆయిల్ దొరికే ప్రాంతాల్లో పనిచేసే కార్మికులు ఊపిరాడక లేదా విషవాయువులు సోకి లేదా కాలుజారి పడిపోయి ఇలా ఎన్నోసార్లు ప్రమాదాలకు గురవడం, ఒక్కోసారి ప్రాణాలే కోల్పోవడం మనం వింటుంటాం. యజమానులు తమ స్వార్థం చూసుకోవడమే తప్ప శ్రామికుల బాగోగులగురించి పట్టించుకోరని, వారికి నష్టం జరిగితే పట్టనట్లుంటారని తిట్టుకుంటాం.

ఇంట్లో రోబోట్లు

మంచి యజమానులైతే నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటారు. ఆమాత్రం మానవత్వం కూడా లేకపోతే తమ తప్పేం లేదని వాదించి నెగ్గుకొస్తారు.

అలాంటి అన్యాయాలు, అరాచకాలు అంతమొందే కాలం చాలా దగ్గర్లోనే వుంది. కార్మికుల్లో విప్లవం వస్తోందా, యజమానులు ఉత్తములు కానున్నారా అని ఆలోచిస్తున్నారా? ఆ రెండూ కాదు, అలాంటి ప్రమాదభరితమైన పనులను నిర్భయంగా చేయగలిగే మరమనుషులు వచ్చాయి, ఇంకా వస్తాయి.

❖ ❖ ❖

ఆడవాళ్ళు ఇంటిపనులు, మగవాళ్ళు బయటిపనులు చేయాలనే పని విభజన ఎప్పుడు జరిగిందో తెలీదుగానీ అదలా కొనసాగుతూనే వుంది. స్త్రీలు ఒకపక్కన వంటా, ఇల్లు చక్కబెట్టడంలాంటి పనులు చేస్తూనే మరోపక్క ఉద్యోగాలు చేస్తూ, ఇంకా ఎలక్ట్రిసిటీ బిల్ కట్టడం, పిల్లల్ని స్కూల్లో దింపడం లాంటి అదనపు పనులన్నీ చేస్తోన్నా మగవాళ్ళు మాత్రం ఇంటిపనుల్లోకి ఎంటరవడంలేదు. 'మేం ఉద్యోగాలు చేయడంలేదా? మీరెందుకు ఇంటిపనులు చేయరు?' అని ఏ వీరనారో ధైర్యంచేసి అడిగితే 'మిమ్మల్నెవరు ఊళ్ళేలమన్నారు? ఇంట్లోనే అఘోరించండి' అనేది జవాబు. 'అంటే మాకు కెరీరక్కర్లేదా?' అని తెగించి అడిగితే 'కెరీరో, కాకరకాయో కావాలంటే మీ చావేదో మీరు చావండి' అనేస్తారు నిర్మొమమాటంగా, కరాకండిగా.

'ఛీఛీ.. ఆడదై పుట్టేకంటే అడవిలో మానై పుట్టడం మేలు', 'అక్కడికేదో గరిట చేత్తో పట్టుకు పుట్టినట్లు నేనే వంటచేయాలా?', 'తింటావుగానీ, వంటకు సాయంరావా?' లాంటి విసుర్లు, విరక్తులకు తెరపడే రోజులు త్వరలో రానున్నాయి. ఎలాగంటే రొప్పుతూరోజుతూ ఆడవాళ్ళు చేసే ఇంటిపనులు, వంటపనులను రోబోట్లు సునాయాసంగా చేసేస్తాయంటున్నారు శాస్త్రవేత్తలు. అవి ఇప్పుడిప్పుడే చైనా మార్కెట్లోకి వస్తున్నాయి. నెమ్మదిగా ప్రపంచమంతా ఆక్రమిస్తాయి.

❖ ❖ ❖

పిల్లలన్నాక అల్లరి చేయడం సహజం. ఆ అల్లరెంత భయంకరమైనా, వాళ్ళ చేష్టలెంత తల్నొప్పి తెచ్చిపెట్టినా పిల్లలొద్దనుకోరెవరూ. బుడతలు, పిడుగులు అని విసుక్కుంటూ, ఇల్లు పీకి పందిరేస్తారని చిరాకుపడ్తూ, అబ్బ ఈ సిసింద్రీలు స్కూలుకెళ్తేనే బెటరని పళ్ళు నూర్తూ కూడా బుజ్జితల్లులు, బుల్లితండ్రులను తెగ ఇష్టపడ్తాం. వాళ్ళే లేకపోతే ఇల్లు బోసిపోదూ అనేస్తాం. అందుకే చదువు, హోదా, ఆరోగ్యం, ఐశ్వర్యం ఎన్నున్నా పిల్లల్లేనివాళ్ళు సంతోషంగా కనిపించరు. వాళ్ళు లేని లోటును అనుక్షణం అనుభవిస్తుంటారు.

అలాంటి పిల్లల్లేనివారు ఇకపై దిగులుపడనక్కర్లేదు. అచ్చం చిన్నారుల్లా వుండే రోబోట్లు రాబోతున్నాయి. అవి అటు పిల్లలు ఆడుకోడానికి, ఇటు పిల్లలు కలగలేదనే దిగులుతో బెంగపెట్టుకున్నవారిని కూడా అలరించనున్నాయి.

❖ ❖ ❖

జెకొస్లొవేకియా నాటక రచయిత ఒకరు 'బలవంతపు శ్రమ' అనే అర్థంలో 'రోబోటా' అనే పదాన్ని ఉపయోగించారు. ఆ పదమే రూపాంతరంచెంది 'రోబోట్'గా మారిందంటారు. అవును మరి రోబోట్‌తో బలవంతంగా పనిచేయిస్తున్నామేగానీ ఇష్టంగా పనిచేసేందుకు అదేమైనా సేవాభావమున్న జీవమా?! 1961 లో జోసెఫ్ ఏంజెల్‌బెర్గర్ తొలి పారిశ్రామిక మరమనిషిని జనరల్



మోటార్స్ కార్పొరేషన్‌కు అమ్మాడు. అది మొదలు మరమనుషుల యుగం ప్రారంభమైందని చెప్పొచ్చు.

తాను చేయాల్సిన శ్రమను యంత్రంద్వారా చేయించుకున్న మనిషి క్రమంగా మెదడు ఉపయోగించి చేయాల్సిన పనులను కూడా యంత్రసాయంతో చేయించుకోవడం అంటే ఆలోచించే యంత్రాలను (ఇంటిలిజెంట్ మెషిన్స్) తయారుచేయడం మొదలుపెట్టాడు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీకి ప్రతీక రోబోట్. వీటిని మీట నొక్కితే పనిచేసే మరమనుషులని కొందరంటే, చెప్పుచేతల్లో వుండే యంత్రబానిసలని కొందరంటారు. మొత్తానికి అవి చేసే పనికి అంతూదరీ వుండదు, వాటి వెల కూడా అందుకు తగ్గట్లే వుంటుంది. ఇప్పటివరకూ కొన్ని టెక్నికల్ పనులకు మాత్రమే వినియోగించిన రోబోట్లను ఇకపై పిల్లలు ఆడుకునే బొమ్మలుగానూ, ఇంటి పనులు, వంటావార్పూ చేసే మనుషులుగానూ చూడబోతున్నాం. అంటే ముందుముందు రోబోట్లు మనకు మరింత సన్నిహితం, ఆత్మీయం కానున్నాయి.

మరమనుషులన్నీ ఒకేరకంగా వుండవు. అవిచేసే పనిని బట్టి, ఆయా రంగాల్నిబట్టి రకరకాల సైజుల్లో, ఆకారాల్లో వుంటాయి. మామూలు మనుషుల్లా కాకపోయినా కీళ్ళనొప్పులున్న వ్యక్తుల్లా నడిచే యంత్రాలూ వున్నాయి. చక్రాలసాయంతో కదిలేవీ వున్నాయి. టెడ్డీబేర్ సైజులో వున్న రోబోట్లూ వున్నాయి. మనిషెత్తున వున్నవీ వున్నాయి. అభివృద్ధికి కామాలేగానీ ఫుల్‌స్టాపులు ఎక్కడా వుండవు. ఉంటే ఎడ్లబండి దగ్గరే కాదు కాలినడకతోనే ఆగిపోయేది ప్రపంచం. విమానాలు, రాకెట్ల వరకూ పురోగమనం వుండేది కాదు. ఆ అభివృద్ధే రోబోట్ల టెక్నికల్ సామర్థ్యం పెరగడానికి కారణమైంది.

నిన్నమొన్నటి వరకూ ఏయే పనులను ఫీడ్‌చేస్తే అంతవరకూ మాత్రమే చేసిపెట్టేవి. ఇకపై మనలా అవీ ఆలోచిస్తాయంటున్నారు సైంటిస్టులు. అలాంటి రోబోట్లకు సైబోర్గ్ అని, యాండ్రాయిడ్' అని పేర్లు పెట్టారు.

హానిచేసే విషవాయువులు విడుదలయ్యే ఫాక్టరీల్లాంటి ప్రదేశాల్లో, గాలి లేక ఊపిరి సలపనట్లుండే వాతావరణంగల గనుల్లో పనిచేసే మరయంత్రాలున్నాయి. మందుల తయారీలో, ప్యాకింగ్ పనుల్లో అనేకమంది రోబోట్లను ఉపయోగిస్తున్నారు. ముందుముందు ఎన్నో ముఖ్యమైన రంగాల్లో రోబోట్లను ప్రవేశపెట్టాలని ఆలోచిస్తున్నారు. రోబోట్‌కీ మనిషికీ పంచేంద్రియాల్లోనే తేడా. రోబోట్ కంటిని కెమెరా కన్ను అంటారు. అది బాగా షార్ప్‌గానే పనిచేస్తోంది. మెదడు శక్తిని మరింత పెంచే ప్రయత్నాలు జరుగుతున్నందున ఆలోచించే రోబోట్లు రానున్నాయి.

రోబోట్ల ప్రస్తావన వస్తే జపాన్‌గురించి ముఖ్యంగా చెప్పుకోవాలి. ఆ దేశస్తులు మరమనుషులను కేవలం పనిముట్లగానే కాక తమ తోటివారిగా, సన్నిహితులుగా చూస్తారు. గ్యాసు, ఎలక్ట్రిసిటీల్లా ప్రతి ఇంట్లో ఒక రోబోటు వుంటే బాగుంటుంది అంటారు జపనీయులు. అక్కడ వయసులో వున్నవారు ఉద్యోగాలకు వెళ్తే మిగిలిన ముసలివారు ఒంటరులు కావడంలేదు. ఎందుకంటారా వారికి సాయంగా వుంటే రోబోట్లొచ్చాయి. వాళ్ళు కావలసిన వస్తువులు లేచి అందుకోలేకపోతే రోబోట్లే అందిస్తాయి. సరదాగా మాట్లాడి కావల్సినంత కాలక్షేపాన్నిస్తాయి. 'మందేసుకున్నావా? ఏమైనా తింటావా?' అంటూ ప్రశ్నించి అవసరమైతే వాటిని తెచ్చిస్తాయి.

ఏంటి పెద్దవాళ్ళకేనా అని నిరుత్సాహపడ్తున్నారా? అబ్బే ఇంటిపనులు కూడా చేస్తున్నాయి. ఫ్లోరంతా కడిగిన ముత్యంలా మెరిసేట్లు తుడిచేస్తాయి. అవి వాక్యూమ్ క్లీనర్ పట్టుకు బయల్దేరాయంటే గోడలు, అల్మరలు, అందులోని బొమ్మలు గట్రా అన్నీ శుభ్రపడాల్సిందే. అలారం మోగినట్లు మెకానికల్‌గా కాకుండా సున్నితమైన పద్ధతిలో నిద్ర లేపుతాయి. ఇ-మెయిల్ వార్తలు చదివి వినిపిస్తాయి. కేవలం ఇంటికే పరిమితం కాదండోయ్. ఆఫీసుల్లో వాచ్‌మన్ అవతారాలూ, ఆసుపత్రులు తదితర ప్రదేశాల్లో రిసెప్షనిస్టు వేషాల్లోనూ కనిపిస్తున్నాయి.

మరి పిల్లల మాటేంటి అంటే వాళ్ళు ఆడుకునే, వాళ్ళతో కలిసి డాన్సు చేసే మరయంత్రాలక్కూడా కొదవేంలేదు. పిల్లల్లేనివాళ్ళు కూడా చింతించనక్కర్లేకుండా అచ్చం పిల్లల్లా ప్రవర్తించే రోబోట్లు కూడా అందుబాటులో వున్నాయి. ఆయా రోబోట్లకు వినికిడి శక్తి వుండటమే కాదు వాటికి పెట్టిన పేరుతో పిలిస్తే అవి పలకడమూ, పదిమంది వరకూ గుర్తుంచుకుని వారికి అనుకూలంగా మాట్లాడ్డం, పనిచేయడం కూడా జరుగుతోందంటే అతిశయోక్తి కానే కాదు. ఇలాంటి మరమనుషులు జపాన్, చైనా లాంటి దేశాల్లో వున్నాయి. నెమ్మదిగా మనదేశానికీ వచ్చే అవకాశముంది.

మనదేశంలో మాదిరిగా ఇతర దేశాల్లో పనిమనుషులు అంత తేలిగ్గా (అతి తక్కువ జీతానికి) దొరకరనేది మనకు కొంతవరకూ తెలుసు. బాగా ధనవంతులైతే తప్ప విదేశీయులు చాలావరకూ తమ పనులు తామే చేసుకుంటారు. మరి ఆ పనులు ఇక్కడికిమల్లే కష్టసాధ్యమైతే చేసుకోలేరుగనుక ప్రతిదానికీ పనిముట్లను కనిపెడ్తున్నారు. అంటే అవసరమే సృష్టికి నాంది అని ప్రత్యేకించి చెప్పనసరంలేదు కదా. బట్టలు ఉతకడం, గిన్నెలు కడగడం, మొదలైన అనేక పనులకు వాషింగ్ మెషిన్, వెస్సెల్ క్లీనర్ వంటి సాధనాలు ఎప్పుడో సమకూరాయి. వంటావార్పూ, పిల్లలు లేదా వృద్ధుల ఆలనాపాలనా చూసుకోవడం లాంటి పనులు చేసుకోలేని పక్షంలో పేద దేశాలనుండి వచ్చేవారిని తక్కువ జీతానికి కుదుర్చుకుంటున్నారు. అలా ఇష్టంలేనివాళ్ళకు ఇకపై ఇబ్బందులేం



వుండవు. ఎందుకంటే ఒక రోబోటును కొనుగోలు చేస్తే చాలు అదే అన్నీ చేసిపెడ్తుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ పని చేసిపెట్టడమే కాదు 'అబ్బో అలిసిపోయామంటూ' చెమటల్లు చిందించవు, ఫోజు కొట్టవు.

ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది లక్షల వరకూ పారిశ్రామిక రోబోట్లు పనిచేస్తుండగా అందులో నాలుగున్నర లక్షల రోబోట్లు అంటే సగానికంటే ఎక్కువ జపాన్‌వాళ్ళే ఉపయోగిస్తున్నారు. అమెరికాలో లక్షా పదిహేనువేలకు పైగా రోబోట్లను వినియోగిస్తున్నారు. మరమనుషులను తయారుచేస్తోన్న సోనీ, టొయోటా, హోండా మొదలైన సంస్థలు జపాన్‌వే. ప్రపంచ ప్రసిద్ధమైన ఈ కంపెనీలు ఇతర దేశాలకు రోబోట్లను ఎగుమతి చేస్తున్నాయి.

కాలం గడిచినకొద్దీ సాంకేతిక విలువలు పెరిగి పారిశ్రామిక మరమనుషులు ఇళ్ళలో, ఆఫీసుల్లో రంగప్రవేశం చేశాయి. ఆటల్లో, పాటల్లో, సేవారంగాల్లో ఇతరత్రా ఉపయోగపడే ఈ రోబోట్లు కేవలం సహాయకులుగా మిగలకుండా సన్నిహితులుగా వుండాలనే ఉద్దేశంతో వుంటుంది.

భూగర్భంలోకి చొచ్చుకుపోగల, గనుల్లోకి పాక్కుంటూ పోగల, బాగా వేడి లేదా అతి చల్లటి ప్రదేశాల్లో పనిచేసే, పొరపాటున కిందపడితే తనకై తాను లేవగలిగే మరమనుషులు వున్నాయి. ప్రమాదం పొంచివున్న చోటుల్లో, కాపలా కాసే మనిషిగా, పేలుడు సామగ్రి వంటి వస్తువులుంటే వాటిని కనిపెట్టి దూరం చేయడం లేదా ఆ విషయమై మెసేజ్ అందించే రోబోట్లు సైతం వున్నాయి. ఈ మరమనుషులకు డిటెక్టర్లను కూడా అమర్చారు మరి. దొంగలెవరైనా వచ్చినట్లయితే అలారం మోగించడం, యజమాని మొబైల్‌కి ఎమర్జెన్సీ మెసేజ్ పంపడమే గాక జరుగుతోన్న అనర్థాన్ని వీడియోతీసి పంపిస్తుంది.

ఇలాంటి అనేక పనులు చేసే రోబోట్ల సంగతలా వుంచితే చైనాలో కొత్తగా వంట చేసే రోబోట్లను తయారుచేశారు. అక్టోబర్ 10న ఎ.ఐ.సి-ఎ.ఐ.కుకింగ్ రోబోట్‌ను దక్షిణ చైనాకు చెందిన షెన్‌జెన్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ మరమనుషులు వేలకొద్దీ చైనా వంటకాలను తయారుచేయగల్గుతాయని షెన్‌జెన్ ఎకనామిక్ డైలీ రాసింది.

ఈ మరమనుషుల నిమిత్తం చైనా శాస్త్రవేత్తలు నాలుగు సంవత్సరాలపాటు శ్రమించారు. రెండు మిలియన్ల యాన్లు అంటే దాదాపు రెండున్నల లక్షల అమెరికన్ డాలర్లను ఖర్చుపెట్టామని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లీ జిన్యు ప్రకటించారు. యుగయుగాల ఆడవాళ్ళ శ్రమతో పోలిస్తే ఈ కష్టం, ఖర్చు ఏపాటి?!

చైనా శాస్త్రవేత్తలు చేసిందల్లా సర్వసాధారణంగా వంటచేసేటప్పుడు ఎటువంటి చర్యలు తీసుకుంటారు అనేది తీసుకుని కంప్యూటర్‌కు దాన్ని అప్లయ్ చేయడమే. ఈ రోబోట్లు సంతోషంగా వేపుళ్ళు చేస్తాయి, ఉడకబెడ్తాయి, కేకులు చేస్తాయి, ఆవిర్లొచ్చినా అలసట చెందకుండా పనిచేస్తాయి. మనుషులు చేసేకంటే కష్టమైన, క్లిష్టమైన పనులను బహు సునాయాసంగా చేసిపారేస్తాయి.

ఈ వంటచేసే రోబోట్ల కంపెనీ నిర్వహించిన ప్రదర్శనలో ఒక రోబోట్ ఐదంటే ఐదు నిమిషాల్లో చూట్టానికి కనువిందుచేస్తూ, నోరూరించేలా ఘుమఘుమలాడే వంటకాన్ని చేసినట్లు షెన్‌జెన్ ఎకనామిక్ డైలీలో రాశారు. 'నాణ్యమైన చైనీస్ ఫాస్ట్ ఫుడ్ తయారీలో కూడా ఈ రోబోట్లు సాయపడ్తాయిని' చైనీస్ ఇంజనీరింగ్ అకాడెమీ మెంబర్ హెగావ్ ఉద్ఘాటించారు.



డాక్టర్ వై జయరామిరెడ్డి, హైదరాబాద్.

మద్యం మానడానికి డీ-అడిక్షన్ చికిత్స

కారణమేదైనా పర్యవసానమే 'మందు'కి బానిస కావడం! సరదాకి ప్రారంభించిన ఈ అలవాటు చివరకు పెద్ద సమస్యయి కూర్చుంటుంది. విశ్రాంతి కలిగిస్తుందని తీసుకుంటున్నది ఆరోగ్యాన్ని చెడగొట్టి అవిశ్రాంతిని పెంచుతుంది. బాధల్ని మరచిపోవాలని మొదలుపెట్టింది మరింత బాధాకరంగా తయారవుతుంది. మనిషిలో ఒంటరితనాన్ని, హింసాప్రవృత్తిని పెంచుతుంది.

అన్ని రకాల మద్యంలోను ఉండేది ఇథైల్ ఆల్కహాల్. ఇది పులియబెట్టడం వలన వస్తుంది. తాగడం ప్రారంభించిన ప్రతి పదిమందిలోనూ ఒకళ్లు తప్పక దానికి బానిసలైపోతున్నారు. ఆల్కహాలు మనసుని ఉత్తేజపరచదు. కేంద్ర నాడీ మండలాన్ని నిరుత్సాహపరచి మెదడు, వెన్నెముకల పనితీరుని తగ్గిస్తుంది

మద్యాన్ని సేవిస్తే అది మిగతా పదార్థాల్లా జీర్ణమై రక్తంలో కలవదు. సరాసరి రక్తంలో కలుస్తుంది. అందుకని తాగిన క్షణాల్లోనే శరీరంలోని అన్ని భాగాలకు చివరకు మెదడుకు కూడా ఇది ప్రవహిస్తుంది. మెదడుని మొద్దుబారేట్లు చేస్తుంది. దాంతో ప్రవర్తనలో మార్పు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. మితిమీరి మద్యపానాన్ని సేవించిన వ్యక్తి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోతాడు. చన్నీటి స్నానం, మజ్జిగ, కాఫీ, భోజనం మొదలైనవేవీ మామూలు స్థితిలోకి తీసుకురాలేవు. కేవలం తాగిన పరిమాణానికి తగ్గ సమయం తర్వాతే మామూలు స్థితికి రాగలుగుతాడు.

రెండు పెగ్గులకి చెమటలు పట్టడం, విచక్షణ కొద్దికొద్దిగా తగ్గడం మొదలౌతుంది. మూడు, నాలుగు పెగ్గులకి తల తిరగడంతోపాటు విచక్షణ బాగా దెబ్బతింటుంది. అయిదారు పెగ్గులకి సరిగ్గా కనిపించకపోవడం, మాటలు తడబడటం జరుగుతుంది. ఒకళ్లు ఇద్దరుగా కనిపిస్తారు. స్పృహ తప్పిపోవచ్చు. అంతకుమించితే ప్రాణం పోవచ్చు.

తనపై తనకు ఎప్పుడైతే అదుపు తప్పిందో అప్పుడే ఆ వ్యక్తి కష్టాల్లో పడ్డట్లు లెక్క. ఈ మద్యపాన అలవాటును ప్రపంచ ఆరోగ్య సంస్థ, అమెరికన్ మెడికల్ అసోసియేషన్ 1956లోనే ఒక జబ్బుగా గుర్తించాయి. మానాలనే ధ్యాస ఉండాలేగాని ఈ 'జబ్బు'ని నయంచేయడం అసాధ్యమేమీకాదు.

తాగుడు అలవాటు ఓ జబ్బు. అంతేగాని ఇది ఏ జబ్బుకీ లక్షణం కాదు. అందుకని దీనిద్వారా వచ్చే జబ్బుల్ని వేటిని నయం చేయాలన్నా ఈ అలవాటుని మాన్పించాలి. ఈ జబ్బుని నయం చేసుకోడానికి ప్రయత్నించకపోతే రోగం ముదిరిపోతుంది. రోజూ కొద్దికొద్దిగా తీసుకుంటున్నా చాలా కాలమయ్యేసరికి దాని ప్రభావం ఆరోగ్యంమీద ఉండి తీరుతుంది. ఆల్కహాల్‌లో ఉండేవి 'ఎంప్టీకాలరీస్'. అందుకని సరైన ఆహారం తీసుకోకపోతే శరీరం ఇంకా త్వరగా దెబ్బతింటుంది.

తాగుడుకు బాగా బానిసైనవాళ్లు హఠాత్తుగా మానేస్తే నిద్రపట్టకపోవడం ఆదుర్దాగా అనిపించడం చేతులు, పెదాలు వణకడం, ఫిట్స్ రావడం, చెవుల్లో ఏవేవో ధ్వనులు వినిపించడం, నెర్వస్‌నెస్ కలుగుతాయి. దాంతో భయపడి ఈ అలవాటుని కంటిన్యూ చేస్తుంటారు. కానీ ఇది తప్పు. స్థిర సంకల్పం ఉండాలేగాని డీ-అడిక్షన్ ట్రీట్‌మెంట్ ద్వారా ఈ అలవాటును మానుకోవచ్చు.

ఇంతకుముందు ఈ అలవాటు మగవాళ్లకే ఎక్కువగా ఉండేది. ఇప్పుడు ఆడవాళ్లలోనూ ప్రబలిపోయింది. ఆడవాళ్లమీద ఆల్కహాల్ దుష్ప్రభావం మగవాళ్లకన్నా ఎక్కువగా వుంటుంది. కారణం మగవాళ్లలో ఆడవాళ్లకన్నా కండరాలు ఎక్కువగా వుంటాయి. ఈ కండరాలలో ఆల్కహాల్ డైల్యూట్ అవుతుంటుంది. బహిష్టు సమయాల్లో ఆల్కహాల్ తీసుకుంటే దాని ప్రభావం ఆడవాళ్లమీద ఇంకా ఎక్కువగా వుంటుంది. జుట్టు ఊడిపోయి తలలో చంద్రులాంటిది రావచ్చు. ఇలా కొంతకాలం తాగితే ఆడవాళ్లలో రక్తహీనత, విరోచనాలు, కడుపులో మంట, చివరికి రోగనిరోధకశక్తి తగ్గి వివిధ రోగాలబారిన పడతారు. కాలేయం, గుండె, పాంక్రియాస్ దెబ్బతింటాయి. తాగుడు అలవాటున్న ఆడవాళ్లలో ఎక్కువమందికి పిల్లలు పుట్టకపోవచ్చు. గర్భస్రావాలు జరగవచ్చు. పిల్లలు గర్భంలోనే చనిపోయి పుట్టవచ్చు. సెక్స్‌ని స్వేచ్ఛగా అనుభవించడానికి కొందరు ఆడవాళ్లు తాగుతుంటారు. ఇది చాలా తప్పు. తాగుడు ఎక్కువైన స్త్రీలకు కామపరమైన కోరికలు, శృంగారపరమైన ఆసక్తి పూర్తిగా తగ్గిపోయే ప్రమాదముంది.

తాగుడెక్కువైతే ఆరోగ్యం దెబ్బతినే మాటటుంచి అజాగ్రత్తగా కార్లని నడపడంవల్ల యాక్సిడెంట్లు జరిగి అమాయకులు బలై పోతుంటారు. రోడ్డు ప్రమాదాల్లో అత్యధికశాతం మితిమీరి తాగి డ్రైవ్ చేయడంవల్లే జరుగుతున్నాయి.

ఆల్కహాల్ ఎక్కువగా తాగడంవల్ల మన శరీరంలో బాగా దెబ్బతినే అవయవం లివర్. ఈ ఆల్కహాల్ బారినుంచి లివర్ తట్టుకోవాలంటే రోజూ తాగడం మంచిది కాదు. వారంలో కనీసం రెండు రోజులైనా తాగుడు జోలికి అస్సలు పోకూడదు. ఈ రెండురోజుల్లో లివర్ తిరిగి మామూలు స్థితికి వచ్చి మళ్ళీ అయిదురోజులు తాగినా తట్టుకోగలిగిన స్థితికి వస్తుంది. లేకపోతే తొందరగా దెబ్బతింటుంది. ఆల్కహాల్ ఎక్కువగా తాగడంవల్ల లివర్‌కి 'సిర్రోసిస్' అనే జబ్బు వస్తుందని మాథ్యూబైల్ అనే శాస్త్రవేత్త 1793లో కనుగొన్నాడు. ఆల్కహాల్ అలవాటువల్ల లివర్‌కి 'సిర్రోసిస్' జబ్బు వచ్చి ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

ఆల్కహాల్‌కి అలవాటుపడడంవల్ల కేంద్రనాడీమండలం సరిగా పనిచేయక ఆల్కహాలిక్ సైకోసిస్ అనే జబ్బు వస్తుంది. అంతేకాదు ఆల్కహాలిక్ హేల్యూసినోసిస్ వస్తుంది. అంటే చెవిలో ఎవరో ఏమో చెబుతున్నట్లు, ఎదురుగా ఏవో కనిపిస్తున్నట్లు భ్రమలు కలుగుతాయి. బి1, బి12 విటమిన్ల లోపం కలుగుతుంది. ఇంకా ఎన్నో అనారోగ్యాలకు దారితీస్తుంది ఈ మద్యపానం.

తాగుబోతు భర్తలున్న ఇళ్లలో రోజూ గొడవలే. తాగి ఇంటికి వచ్చిన భర్తలతో గొడవపడే ఇల్లాళ్లు ఎంతోమంది. ఈ తాగుడు కారణంగా భార్యాభర్తల మధ్య గొడవలొచ్చి విడాకులు తీసుకున్న జంటన్నో వున్నాయి. చివరకు ఈ దుష్ప్రభావం వాళ్ళ పిల్లలమీద కూడా పడుతుంది. తాగుడు అలవాటున్నవాళ్లలో మానాలనే దృఢ సంకల్పం ఉండాలి. అప్పుడే మానగలుగుతారు. తమ ప్రయత్నం లేకుండా మానిపించడం జరగని పని.

డీ-అడిక్షన్ చికిత్సద్వారా మద్యం అలవాటును మానడం సులువు.

హోమియో మందులు మెదడులో కలిగే చెడు ఆలోచనలను, ఆల్కహాల్ తాగాలనే కోరికను రాకుండాచేసి వాటిపై అయిష్టతను, వికారాన్ని కలిగిస్తూ ఆల్కహాల్‌కు దూరమయ్యేట్లు చేస్తాయి. చాలామందిలో మద్యం తాగుతూ ఒకేసారి మానేసినట్లయితే విత్‌డ్రాల్ లక్షణాలకు గురికావటం వలన వాళ్ళు తిరిగి అలవాటు కొనసాగించటం జరుగుతుంది. అయితే హోమియో మందులు వాడటంవలన, ఇలా విత్‌డ్రాల్ లక్షణాలు రాకుండా చేయడం వలన ఆల్కహాల్ తాగడం మానుకొనే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ మందు ఆల్కహాల్ అలవాటును మాన్పించటానికే కాక అప్పటివరకు తాగుడు అలవాటుద్వారా కలిగిన దుష్పరిణామాలకు విరుగుడుగా పనిచేసి తాగుడు అలవాటుద్వారా వచ్చే జబ్బులు రాకుండా నివారిస్తాయి. మందు మొదలుపెట్టిన మొదటి వారంనుంచి మార్పు మొదలై 3,4 వారాల్లో ఆల్కహాలు తాగే అలవాటు మానేస్తారు. కొద్దిమందిలో మాత్రం తదుపరి కౌన్సిలింగ్ అవసరముంటుంది. ఇతర వైద్య విధానాలలో ఎన్నో సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశాలుంటాయి. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని పూర్తి సురక్షితమైన హోమియో మందులద్వారా ఈ ఆల్కహాల్ అలవాటును మానుకోవడం ఎంతో సులభం.

♣

కథ

కేతవరపు భాస్కర్

గంగపుత్రులు

రాత్రి రెండుగంటలైంది.

ఊరిమధ్యలో ఓ బక్క కుక్క ఉండుండి బౌయ్...మని అరుస్తోంది. ఆ నిశ్శబ్ద నిశీధిలో దాని అరుపు ఊరు ఊరంతా ప్రతిధ్వనిస్తోంది.

ఆ కుక్క అరుపుకి పోలిగాడికి చటుక్కున మెలకువొచ్చింది.

'ఛస్, ఎదవ కుక్క' అని బూతులు తిట్టాడు. అలా పడుకునే ఆకాశంలో తూర్పువేపు చూశాడు. చుక్క పొడిచింది. అది చూసి పోలిగాడికి నిద్రమత్తు వదిలిపోయింది. మంచంమీంచి లేస్తూనే తుపుక్కున కాండ్రించి ఊశాడు.

మంచం బరబరా గుడిసెలోకి ఈడ్చాడు.

"అమ్మా... ఓ...లమ్మా! నేనెల్తన్నా, జాగర్తే" అని చెప్పాడు.

"ఒరే అయ్యా, తుపానంటన్నార్రా! పోనీ ఇయాల ఎల్లకురా!' ముసుగు తన్నిన దుప్పట్లోంచే గొణిగింది ముసిల్ది.

''ఎల్లకపోతే అవదే. మనం డాట్రుకాడికెల్లాలా! ఎల్లాలంటే డబ్బుండాలా! మరి అయుండాలంటే నానెల్లక తప్పదు కదా! అయినా, తుపానెక్కడే? ఆకాశంలో సుక్కని సూడే. ఆ తుపానెక్కడో ఉందంట. మనకేం బయం నేదు. పొద్దుటేలకొచ్చీనేంటి?!" చెప్పాడు పోలిగాడు.

చేసేదేంలేక "సేమంగా ఎల్లి రా అయ్యా!" సొట్టలు పడిన సిల్వర్ క్యారేజీలో చద్దన్నం పెట్టి ఆప్యాయంగా చేతికందిస్తూ చెప్పింది తల్లి.

❖❖❖

పందుంపుల్ల నోట్లో పెట్టుకుని గబగబా అడుగులేశాడు పోలిగాడు. వెళ్తూ వెళ్తూ పక్క గుడిసెలో ఉన్న ఈరిగాణ్ణి కేకేశాడు.

"తుపానంటన్నార్రా! నానియ్యాల రాన్రై. నువ్వూ ఎల్లకై" అన్నాడు ఈరిగాడు.

''ఛన్, నువ్వు రాపోతే మాన్రై. ముసిల్దానికోసవైనా నానెల్లక తప్పదు" తనలోనే అనుకుంటూ అడుగులేశాడు పోలిగాడు.

వాడి కాళ్లు తిన్నగా ఊరికి తూర్పుగా ఉన్న ఇసుక తిన్నెలవైపు దారి తీశాయి. తిన్నెలు దాటుకుని వెళ్లేసరికి వాడి కళ్లముందు ప్రత్యక్షమైంది సముద్రం.

ఆవేళ సముద్రం మృత్యువులా గంభీరంగా ఉంది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. అది చూసి పోలిగాడు ఓ క్షణం తటపటాయించాడు.

''ఎల్తే ఏవన్నా పెమాదవేంవో!'' అనుకున్నాడు.

మరుక్షణంలోనే అవసరం కళ్లముందు మెదిలింది. అదే వాడిని బతుకు పోరాటానికి సిద్ధం చేసింది.

ఇసుక తిన్నెపై ఉన్న తెప్పను కష్టపడి నెమ్మదిగా సముద్రంలోకి నెట్టాడు. ఎంతో అనుభవం ఉన్న వాడి చేతులు ఆ తెప్పను ఉవ్వెత్తున లేచి పడుతున్న అలలమీంచి అవలీలగా దాటించాయి.

"ఎందుకైనా మంచిది. ఇయాల మరీ లోపలికి ఎల్లకూడదు" అని పదే పదే అనుకున్నాడు.

తెడ్డు వేస్తూ పోలిగాడు తెప్పతో సహా అలా అలా సముద్రంలోకి పోతున్నాడు. బలంగా గాలులు వేస్తున్నా తెప్పను నిలుపుకోగల్గుతున్నాడు. మధ్యమధ్యలో వల వేస్తున్నాడు.

వాడి దురదృష్ట వేంటోగానీ అనుకున్నట్టుగా ఆవేళ వాడికి పెద్దగా చేపలు దొరకటంలేదు.

వాడికేం తెల్సు? అంతకుముందే విదేశీ ట్రాలర్ ఒకటి వచ్చి అక్కడి చేపలను కొల్లగొట్టిందని!!

దొరికిన చేపల్ని, రొయ్యల్ని జాగ్రత్తగా పట్టి తెప్పలోని బుట్టలో భద్రం చేస్తున్నాడు.

ఎంతకీ బుట్ట నిండటంలేదు. 'ఇది నిండితే కానీ, నా అవసరం తీరదు. ముసిల్దాన్ని డాట్రుకాడికి తీసికెళ్లాలంటే డబ్బులు కావాలి. అవి కావాలంటే ఈ బుట్ట నిండాలి...' తల్లి అనారోగ్యం గురించి ఆలోచిస్తూ తనకు తెలీకుండానే అలా సముద్రం లోపలికి వెళ్లిపోయాడు పోలిగాడు.

❖❖❖

తెల్లారింది. తూర్పున సూరీడు కనిపించటంలేదు కానీ, వెలుగు వచ్చింది. పోలిగాడికి ఆకలైంది.

తల్లి ఇచ్చిన చద్దన్నం సుబ్బరంగా తిన్నాడు. మళ్లీ వేటలో పడ్డాడు. కానీ, వాడనుకున్నట్టు చేపలు పడందే.

ఈలోగా చినుకులు మొదలయ్యాయి. చూస్తూండగానే ఆ నడిసంద్రాన వర్షం కురవసాగింది. వర్షంలో తడిసిన పోలిగాడి నల్లటి దేహం చల్లదనానికి బిర్రబిగిసింది.

''ఇయాల ఎలా లేదన్నా ఎయ్యి రూపాయల సరుకన్న పట్టుకెల్లాల! నేపోతే కట్టవేఁ. ముసిల్దాన్ని డాట్రుకాడికి తీసికెల్లాల. పాపం దాని పానానికేం బాలేదు. దానికి కిడ్డీలో ఏవో పాడైపోయాయేమోనంటాడు డాట్రు. పరీచ్చలు

చేయాలంటాడు. ఎలా లేదన్నా ఐదారొందలుండాలి. అంత డబ్బుండాలంటే... ఇయాల ఎయ్యి రూపాయల సరుకు పట్టుకెల్లాల్సిందే. ఇంకెంత? ఇంకో గంట సాలు" పరిపరివిధాల ఆలోచిస్తున్నాడు పోలిగాడు.

చూస్తూండగానే వర్షం, గాలులు మరింత ఉధృతమయ్యాయి.

"ఏటింత గాలులేసేస్తున్నాయి? ఇక ఇంటికి పోదాం" అనుకుని వెనక్కి తిరిగాడు పోలిగాడు.

అదే సమయంలో అనుకోకుండా వాడి తెప్ప తలకిందులైంది. ఓ చేత్తో చేపల బుట్టను ఒడుపుగా పట్టుకుని, రెండో చేత్తో తెప్పను సరిచేయడానికి ప్రయత్నించాడు. కానీ, గాలి విసురుకు తెప్ప ఒక్కసారిగా ముందుకు పోయింది.

చుట్టూ అఖండ జలరాశి. మధ్యలో చేపల బుట్టతో పోలిగాడు. ఈదుతూనే తెప్పకోసం గాలిస్తూ తీరంవైపుకు వస్తున్నాడు.

ఎప్పుడో పొద్దున్న తిన్న చద్దన్నమే. ఓ పక్క ఆకలి... మరోపక్క ఈదకపోతే బతికే దారి కనిపించటంలేదు. అన్నింటికీ తెగించి ఈదుతూనే ఉన్నాడు.

సరిగ్గా ఆ సమయానికి...

❖❖❖

ఈరిగాడి గుడిసెలో రేడియో వింటోంది పోలిగాడి తల్లి.

"బంగాళాఖాతంలో ఏర్పడిన పెనుతుఫాను విశాఖపట్నానికి ఆగ్నేయంగా 300 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది..."

ఇంకా రేడియోలో చెప్తూనే ఉన్నాడు.

"బగమంతుడా! బిడ్డని ఎలాగైనా రచ్చించు తండ్రీ" అని మనసులోనే కోటి దేవుళ్లకు మొక్కుతోంది ముసిల్ది.

ఆవేళ తుఫాను గాలులు ప్రళయభీకర రూపమెత్తాయి. చెట్లు జడలు విరబోసుకున్న దెయ్యాల్లా భయంకరంగా ఊగిపోతున్నాయి. ఎడతెరిపిలేని వర్షం. ఎటు చూసినా నీరే. కంటిముందేమీ కనిపించనంత ఉధృతంగా వర్షం కురుస్తోంది.

రేడియోలో పాట వినిపిస్తోంది.

"నీళ్లల్లో నువ్వెళ్తే... నీవాళ్లకూ యాతనా...
నీరాకా జాగైతే... అందాకా శోధనా...
బెస్తవాళ్ల జీవితాలూ ప్రతిపూటా గండవే!
రేవు చేరుకున్నవేళ ప్రతి రోజూ పండగే...."

పాట అలా సాగిపోతోంది.

పోలిగాడి జాడేదైనా కనిపిస్తుందేమోనని అంత వర్షంలోనూ కళ్లు చిట్లించుకుని మరీ చూస్తోంది ముసిల్ది. ఊహూ! అలాంటిదేవీ ఆమె కంటికి కానరాలేదు.

ఉదయం మధ్యాహ్నమైంది. మధ్యాహ్నం సాయంత్రమైంది. చూస్తూండగానే చీకట్లు కమ్మాయి. కన్నబిడ్డ కోసం ఆ రోజంతా కళ్లల్లో ఒత్తులేసుకుని మరీ చూసింది ముసిల్ది.

అర్ధరాత్రైంది. తుఫాను తీవ్రత తగ్గింది.

❖❖❖

నిద్దర్లేని కళ్ళతో, ఓపికలేని శరీరాన్ని నిబ్బరించుకుంటూ పొద్దున్నే లేచింది ముసిల్ది. తన కొడుక్కేమీ కాకూడదని, వాడు క్షేమంగా రావాలని దేవుడికి పదేపదే దణ్ణాలు పెట్టుకుంది.

ఉన్నట్టుండి ఊరంతా సముద్రంవేపు పోతూంటే ఏం జరిగిందోనని పరుగు తీసింది. పరిగెడుతోందే కానీ, ఒకటే ఆలోచన.

'నా బిడ్డకేం కాకూడదు బగమంతుడా' అంటూ ఆమె ప్రార్థిస్తూనే ఒడ్డుకు చేరింది.

కెరటాలు ఒడ్డుని తాకేచోట దూరంగా ఓ మనిషి ఇసుకమీద బోర్లా పడి ఉన్నాడు. ఉండుండి కదుల్తున్నాడు. వాడి చేతిలో చేపల బుట్ట.

మొట్టమొదట ముసిల్దే పోలిగాణ్ణి పోల్చుకుంది. ఎంతైనా కన్నతల్లి కదా!

"ఓరే అయ్యా!" అని అరుస్తూ వాడి దగ్గరకు పరుగు తీసింది. కొడుకు తలని ఒళ్లోకి తీసుకుంది. 'బగమంతుడు అన్నేయం సేసేశాడ'ంటూ కన్నీరుమున్నీరైంది. ఆ నీటితో ఆమె చూపు మసకబారింది. కంటిముందు కొడుకు రూపం తప్ప మరేమీ కనిపించటంలేదు.

తన దగ్గరే కూచున్న ఈరిగాడికేసి అతి కష్టమ్మీద తలతిప్పి ఏదో చెప్పే ప్రయత్నం చేశాడు పోలిగాడు.

"ఏట్రా?" అన్నాడు ఈరిగాడు.

తల్లికి వైద్యం చేయించడానికి అవసరమైన డబ్బుల కోసం ప్రాణాలకు తెగించి తాను పట్టి తెచ్చిన చేపల్ని ఈరిగాడికి చూపించాడు పోలిగాడు. మళ్లీ తల్లిని చూపించాడు. ఏదో చెప్పాలనుకున్న వాడి నోటి నుంచి మాటలు రావటంలేదు.

వాడి బాధ ఈరిగాడికి అర్థమైంది.

అక్కడే ఉన్న పోలిగాడి తల్లికీ అర్థమైంది. ఆ ముసిల్దాని గుండె పగిలింది.

"ఈ ముసిలి పేనం రేపోమాపో సోయేదే కదరా! కాటికి కాళ్లు జాపుకున్న నాకోసం... నన్ను బతికించడం కోసం నీ బతుకు బలిపెట్టావా అయ్యా!" అంటూ పోలిగాడిమీద పడి పొగిలిపొగిలి ఏడ్చింది.

"ఏటే ముసిలీ? ఏటా మాటలు? పోలిగాడికేం కాదు. మావంతా లేవేటి?" అని ధైర్యం చెప్పాడు ఈరిగాడు.

వాడు అక్కడినుంచి వెంటనే లేచాడు. "ఒరేయ్, అలా సూత్తారేట్రా? పోలిగాణ్ణి డాక్టరుకాడికి పట్టుకుపోదాం, రండొరే" అని ఊళ్లోవాళ్లని పిలిచాడు.

అంతా వచ్చారు. పోలిగాణ్ణి డాక్టర్‌వద్దకు తీసుకెళ్లే ఏర్పాట్లలో పడ్డారు. తక్షణం ఎవరో వెళ్ళి ఆటో తీసుకొచ్చారు.

పోలిగాడిపై పడున్న ముసిల్దాన్ని పక్కకెళ్లమన్నారు. ఆమె పట్టించుకోలేదు.

పోలిగాణ్ణి తీసుకెళ్దామనే హడావిడిలో ఆ ముసిల్దాని ఏడుపు ఎప్పుడు ఆగిందో ఎవ్వరూ గమనించనేలేదు.

"లెగే" అంటూ దానిని రెక్క పుచ్చుకు లేపారు.

ఆ ముసిల్దాని శరీరం ఆ ఇసుకలో దబ్బున పడింది.

"అయ్యో! ముసిల్ది సచ్చిపోయిందొరే...!" ఈరిగాడు గాభరాగా చెప్తూనే ఉన్నాడు.

అంతలోనే జరిగిపోయిందా సంఘటన.

ఉన్నట్టుండి ఓ పెద్ద కెరటం ముందుకు ఉరికి వెనక్కి వెళ్లిపోయింది. దాంతోపాటే పోలిగాడి దేహం సముద్రంలోకి వెళ్లిపోయింది. ఆ వెనుకే ముసిల్దాని నిర్జీవ శరీరం కూడా.

✤







అవీ... ఇవీ

వంకర మాటలు మాట్లాడీ మాట్లాడీ
ఆమె నాలుకలా ఐపోయిందట!

నీతిగా...

ఎన్నికల్లో సీటొచ్చె
ప్రమాణ స్వీకరణ ప్రకటించె
పదవిలో చేపట్టినంక
బడుగుజీవుల కడుపుకొడ్తూ
అడిగేవారు లేరనుకుంటూ
సింహంలా గర్జిస్తూ
నాదే ప్రపంచమనుకుంటూ
ఎగిరెగిరి గంతులేయకు
కూసింత తెలివిగా, కాసింత నీతిగా బ్రతుకు.

\- ఎం.ఎం.అబ్బాలోము.







అదే...

ప్రపంచంలో అన్నీ నావే అంటుంది
బాధకు దూరంగా వుంటుంది
ప్రేమకు చేరువ అవుతుంది
త్యాగానికి ముందు వుంటుంది
బంధాలను తనలో
కలుపుకుంటుంది
స్నేహాన్ని పదిలంగా
దాచుకుంటుంది
అదే హృదయం

\- పి. దిలీప్ కుమార్



ఎందుకలా
చూస్తారు,
నా ముక్కు
బాగానే
వుందిలే...


మీరు ఆ 'స్కాం' చెయ్యడం వల్ల చట్టప్రకారం మిమ్మల్ని ఎవ్వరూ కోర్టుకీడ్చలేరు... కాకపోతే చెడ్డ పేరొస్తుంది అంతే!!

నవంబర్ 26
న్యాయ
దినోత్సవం
సందర్భంగా


ఆ జడ్జిగారు వారంవారం మన రచ్చబండ దగ్గర తీర్పులు విని.. అవే హైకోర్టులో అమలు చేస్తాడ్లే!!


ఇక్కడ సాక్ష్యులకే తప్ప... మనస్సాక్షికి గుర్తింపు లేదు కనుక... నిన్ను నేరస్థుడిగా పరిగణిస్తూ...
సత్యమేవ జయతే


విడాకులిప్పించడంలో సీనియర్. వృత్తికి ఆదర్శంగా నిలవాలని సొంత భార్యకూడా విడాకులిచ్చినవాడు!!
నారాయణ BALLB


మన న్యాయ వ్యవస్థలో … డబ్బున్నోడికే న్యాయం దక్కుతుంది.. పేదోడికి కష్టం! కాబట్టి పోతే పోయిందని వదిలేసుకోవోయ్!!


పట్టుచీర కొనే విషయం ఇంకా పరిశీలనలో ఉన్నందున వచ్చే సంక్రాంతికి వాయిదా వెయ్యడమైనది!!

పాతిక సంవత్సరాలు ఆలస్యమైతే అయ్యింది... కేసులో మనమే గెల్చాం బావ... ఇదిగో తీర్పు!!
1985

బిల్డప్ కోసం తప్ప... మీకెందుకండీ అన్నిపుస్తకాలూ... జీవితంలో ఒక్కటైనా పూర్తిగా చదివారా!

మనసా... తెలుసా?

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్,
పర్సనాలిటీ
డెవలప్‌మెంట్ ట్రైనర్,
ఫోన్ :
9849130141

హిప్నో కమలాకర్

నేను ఒక టీచర్‌ను. తల్లిదండ్రులకు దూరంగా వేరే ఊర్లో ఉంటున్నాను. అనుకోకుండా నేనుండే ఇంటి యజమాని కొడుకుతో పరిచయం అయ్యింది. అదికాస్తా ప్రేమగా మారింది. అతను పిల్లల తండ్రి అని తెలిసి కూడా అతనికి లొంగిపోయాను. అతన్ని మర్చిపోలేకపోతున్నాను. ప్రతిక్షణం అతని ఆలోచనలే. అతని వ్యాపకం నుంచి బైటపడేదెలాగో చెప్పండి.

– కళ్యాణి, గుంటూరు.

మీ అస్థిమిత మనసును అతను సొమ్ము చేసుకుంటున్నాడంతే. భార్య అందంగా లేకపోయినా వారిద్దరికీ పిల్లలు పుట్టారు కదా! మరి అలాంటప్పుడు భార్య అందంగా లేకపోవడంతోనే మీతో సంబంధం ఏర్పరచుకున్నాడనుకోవడం మూర్ఖత్వం. మీలోని ఒంటరితనం అతన్ని మీకు దగ్గరయ్యేలా చేసింది. దాన్ని మీరు అర్థం చేసుకునేలోపుగానే మీరు అతన్ని ప్రేమించడం మొదలుపెట్టారు. ఆ విషయం కాస్తా, శారీరక సంబంధానికి దారి తీసింది. ముందు మీరు అతని ఆలోచననుంచీ బయటపడండి. మీకు అతనిపట్ల స్నేహభావంతో ఒంటరితనాన్ని దూరం చేసుకునే ఆలోచన కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిన విషయం గ్రహించండి. మీ ఆత్మగౌరవాన్ని తిరిగి నిలబెట్టుకునే ప్రయత్నం చేయండి. వీలైతే ఆ ఊరినుంచి వేరే ఊరికి ట్రాన్స్‌ఫర్ చేయించుకోండి. అయినా అతణ్ణి మర్చిపోలేకపోతుంటే, సైకాలజిస్ట్‌ను కలిసి కౌన్సిలింగ్ తీసుకోండి.

మేం పెద్దలను ఎదిరించి కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాం. ఇప్పుడు నేను ఇద్దరు చిన్నారులకు తల్లిని. ప్రభుత్వోద్యోగం చేస్తున్నాను. ఆయన కొన్నేళ్ళుగా గల్ఫ్‌లో ఉంటున్నారు. నాకూ పిల్లలకూ ఏ లోటూ చేయరు. అయితే ఆయనకు తన సహోద్యోగినితో సంబంధం ఉందన్న సంగతి తెలిసింది. పైగా ఆమెతో వేరే దేశం వెళ్ళే ప్రయత్నంలో ఉన్నారు కూడా. నేను ఆ విషయం అడిగితే తన వ్యక్తిగత విషయాల్లో తలదూరిస్తే విడాకులిస్తానని బెదిరిస్తున్నారు. మాది ప్రేమ వివాహం కావటంతో పుట్టింటివారితోనూ, అత్తింటివారితోనూ సరైన సంబంధాలు లేవు. పైగా విడాకులు తీసుకుంటే ఇద్దరు పిల్లల్ని పోషించగల స్థోమత నాకు లేదు. కోర్టులచుట్టూ తిరగలేను. అతనితోనే కలిసుందామంటే ఏ ప్రాణాంతక వ్యాధి సోకిందోనని భయపడుతున్నాను. ఈ పరిస్థితిలో నేనేం చేయాలో చెప్పండి.

– రోహిణి, గుడివాడ.

మీరు మీ కాళ్ళమీద నిలబడి ఉద్యోగం చేసుకుంటూ ఉన్నారు. మీది ప్రేమ వివాహమే ఐనప్పటికీ ఇలా దూరదూరంగా ఉండటంతోనే అసలు సమస్య ఏర్పడినట్లు అర్థమవుతోంది. ఆయనలా ఏళ్ళ తరబడి విదేశాల్లో ఉంటున్నా మీరు అతని దగ్గరకు ఎందుకు వెళ్లలేదు? మీరు చేసేది ప్రభుత్వోద్యోగమైనా, దీర్ఘ సెలవు పెట్టే అవకాశముంటుంది కదా? మీరెలా ఒంటరితనంతో బాధపడుతున్నారో, అదే విధంగా అతనూ బాధపడుతూనే ఉండొచ్చుకదా. అదే సమయంలో అతని సహోద్యోగిని ఓదార్పు, స్నేహం అతనికి ఆత్మీయంగా తోచి ఉంటాయి. మీరు అతనికి దగ్గరయ్యే ప్రయత్నం చేయండి. అంతేకానీ, ద్వేషం పెంచుకుని అనవసరంగా సంసారాన్ని ముక్కలు చేసుకోకండి. తల్లిదండ్రులిద్దరి నీడలో పెరిగితేనే పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్న నిజాన్ని గ్రహించండి. ఇక ఆయనకేమైనా వ్యాధులున్నాయేమోనని భయపడుతున్నానంటున్నారు. అది అనవసరం. అపోహలతో దూరం కాకుండా, వైద్యపరిక్షలతో ఆ అపోహలను దూరం చేసుకునే ప్రయత్నం చేయండి.

మాది మధ్యతరగతి కుటుంబం. నేను పీజీ చేస్తున్నప్పుడు ఒకతనితో పరిచయం అయ్యింది. అతను పెద్దగా చదువుకోలేదు. అయితే బాగానే చూసుకుంటాడన్న నమ్మకంతో అతన్ని పెళ్ళి చేసుకున్నాను. అయితే, పెళ్ళయిన నాటినుంచీ అత్తవారింట నరకం అనుభవిస్తున్నాను. అతను చాలా అనుమానం మనిషి. జీతం మొత్తం గుంజుకుంటాడు. విడాకుల ప్రసక్తి తెస్తే చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడు. మా నాన్న చావుబతుకుల మధ్య ఉన్నప్పుడు ఒకతను మాకు చాలా సాయం చేశాడు. అతనికి, నాకు ఏదో ఉందని ఈయన నానా రభసా చేశాడు. నాన్న చనిపోయి అందరూ విలపిస్తూంటే, ఈయన అక్కడా నన్ను కొట్టి అందరిముందూ నానా రభసా చేశాడు. నాకు, పిల్లలకూ శాంతి లేకుండా చేస్తోన్న నా భర్త విషయంలో నేనెలా ప్రవర్తించాలో అర్థంకావడంలేదు.

– రాధిక, ఒంగోలు.

మంచి ఉద్యోగం చేస్తూ హాయిగా ఉండాల్సిన సమయంలో మీరింత బేలగా ఎందుకు ప్రవర్తిస్తున్నారో తెలియటం లేదు. మీరు సొంతంగా సంపాదించుకుంటూ మీ కాళ్ళమీద మీరు నిలబడ్డారు. అటువంటప్పుడు ఒకరి గురించి భయపడుతూ ఎన్నాళ్ళు ఇలా బాధలు పడుతుంటారు? మీకు అతనితో జీవించాలని లేకపోతే ఆ విషయం మీ తల్లిదండ్రులకు ఎందుకు చెప్పలేదు? మీ నాన్నగారి మరణ సమయంలోనూ అతను ఆ విధంగా ప్రవర్తించాడన్నారు. అది అందరూ చూసే ఉంటారు కదా! అలాంటప్పుడు మీ చుట్టాలలో ఎవరో ఒకరికి మీ పరిస్థితి వివరించండి. విడాకులు అడిగితే చంపుతానంటున్నాడని చెప్పండి. లేదా, పోలీసుల దృష్టికి ఈ విషయం తీసికెళ్లండి. మీరు ఎవరిమీదా ఆధారపడటంలేదన్న విషయాన్ని గ్రహించండి. బేలతనాన్ని వీడండి. ధైర్యంగా ముందుకెళ్ళే ప్రయత్నం చేయండి.

సమస్యలకు ఆహ్వానం

మీకు లేదా మీవాళ్ళకు మానసికమైన సమ్యలేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. సైకాలజిస్ట్ శ్రీ హిప్నోకమలాకర్ తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.



చంద్రునిపై పరిశ్రమలు

ఎస్. వెంకట్రావు

చంద్రమండలంపైకి టికెట్లన్నీ అయిపోయాయి. చంద్రునిమీదకు వెళ్లాలనుకున్నవారు మరో ఏడాది ఆగక తప్పదు. అంతరిక్ష కేంద్రం-2కు మాత్రం ఇంకా కొద్దిగా టిక్కెట్లు మిగిలున్నాయని అంతర్జాతీయ అంతరిక్ష పర్యాటక విభాగం అధికారులు తెలిపారు. అంతరిక్ష పర్యాటకుల సంఖ్య అంతకంతకూ పెరుగుతున్నందున చంద్రలోక యానానికి మరికొన్ని కొత్త సర్వీసులు ప్రారంభించే విషయం ఆలోచిస్తున్నట్లుగా వారు చెప్పారు. యాత్రీకుల సంఖ్యతోబాటు పారిశ్రామిక అవసరాల నిమిత్తం కూడా చంద్రమండల యానాల సంఖ్య పెంచాలని యోచిస్తున్నారు. అంగారక గ్రహ యాత్రకు వెళ్లే అంతరిక్ష వాహనాలూ, ఇతర పరికరాలూ, ఇంజినీర్లూ, సాంకేతిక పనివారితో కొద్దిరోజుల్లోనే ఒక భారీ వాహనం చంద్రునిపైకి వెళ్లనున్నట్లు తెలిపారు... పత్రికల్లోనూ, టివి, ఇంటర్‌నెట్ వార్తల్లోనూ ఇటువంటి విశేషాలు ప్రత్యక్షమయ్యే రోజులు ఎంతో దూరంలో లేవు. ఒక దశాబ్దం... మహా అయితే మరో రెండు దశాబ్దాల్లో ఇటువంటి పరిస్థితి వస్తుందని శాస్త్ర-సాంకేతికాభివృద్ధి దశాదిశలను పరిశీలిస్తున్న నిపుణులు చెబుతున్నారు.

భవిష్యత్తులో మానవ అంతరిక్ష పరిశోధనలకు చంద్రమండలం వేదిక కాబోతోందని నిపుణుల అంచనా. అంతేకాదు చంద్రునిపై పెద్ద ఎత్తున గనులు తవ్వి, పరిశ్రమల్లో శుద్ధిచేసి ఇంధన పదార్థాలను భూమ్మీదకు తెచ్చుకోవలసిన పరిస్థితులు కూడా వస్తున్నాయని వారు చెబుతున్నారు.

చంద్రునిపై మానవునికి చారిత్రకంగా ఉన్న ఆసక్తి అతన్ని తొలిసారి ఆ గోళంమీదకు పంపింది. అయితే త్వరలోనే ఈ ఆసక్తి తగ్గిపోవడంతో, 1969లో ప్రారంభమై మూడేళ్ల పాటు సాగిన ఈ చంద్రమండల యాత్రలు కూడా ఆగిపోయాయి. కానీ మళ్లీ ఇప్పుడు పారిశ్రామిక, ఆర్థిక అవసరాలు మనిషిని చంద్రునిపైకి నెడుతున్నాయి. ఏమిటీ అవసరాలు? మొదటిది, ఇంధన అవసరం.

ప్రపంచంలో అభివృద్ధి రేటు ఇలాగే కొనసాగితే మరో పదేళ్లలో పెద్ద ఇంధన సంక్షోభం రానున్నదని నిపుణులు చెబుతున్నారు. మనిషికి పెరుగుతున్న ఇంధన అవసరాలు తీర్చే పరిస్థితిలో శిలాజ ఇంధనాలు అంటే పెంట్రోలియం ఉత్పత్తులు లేవు. జల ఇంధనం చాలా పరిమితం. అది కూడా పూర్తిగా కాకపోయినా చాలావరకు వినియోగంలోకి

వచ్చేసింది. పవన, సౌర, అలల ఇంధనాలు ఉపయోగించుకున్నా అనేకరెట్లు పెరుగుతున్న మనిషి అవసరాలకు ఇవి చాలవు. మానవ నాగరికత అభివృద్ధివేగం ఇంధన వినియోగంలో పెరుగుదల వేగంపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల భవిష్యత్తులో మానవజాతి తన ఇంధన అవసరాలకోసం కొత్తకొత్త వనరులను చూసుకోవాల్సి వస్తుంది. అణు ఇంధనం అతనివద్ద ఉన్న మంచి వనరు. కానీ ఈ ఇంధనం కూడా పరిమితంగానే ఉంది. యురేనియం నిల్వలు చాలా పరిమితం. థోరియంను ఉపయోగించుకోవచ్చునని మన రాష్ట్రపతి అబ్దుల్ కలాంతో సహా చాలామంది నిపుణులు చెబుతున్నారు. అయితే థోరియం నిల్వలు కూడా అపరిమితం కాదు. పైగా యురేనియంగాని, థోరియంగాని ఉపయోగించినప్పుడు అణువిచ్ఛేదన ప్రక్రియలద్వారా వేడిమి ఉత్పత్తి అవుతుంది. ఆ వేడితో నీటిని మరిగించి ఆవిరితో జనరేటర్లు తిప్పి విద్యుత్తు ఉత్పత్తి చేస్తారు. ఈవిధంగా విద్యుదుత్పత్తి చేయడం పర్యావరణం దృష్ట్యా చాలా ప్రమాదంతో కూడిన పని. పైగా అణువిచ్ఛిత్తి పదార్థం అందుబాటు కూడా అంతంత మాత్రం. వాటిని నిల్వ ఉంచడం, వ్యర్థాన్ని పారవేయడం ఖర్చుతోనూ, ప్రమాదంతోనూ కూడిన పని.

అందువల్ల మానవుని భవిష్యత్తు ఇంధన అవసరాలు తీరేది అణు-సంయోగ ప్రక్రియ (న్యూక్లియర్ ఫ్యూజన్) వల్ల లభించే విద్యుత్తుద్వారా మాత్రమేనని చాలామంది నిపుణులు చెబుతున్నారు. అణు-సంయోగ క్రియ అంటే హైడ్రొజన్ బాంబు ప్రయోగించేటప్పుడు జరిగే ప్రక్రియ అన్నమాట. సూర్యునిలోనూ, నక్షత్రాల్లోనూ ఇటువంటి అణు-సంయోగక్రియలు వేలూ, లక్షల్లో నిరంతరం జరుగుతుంటాయి కనుక అక్కడినుండి పెద్ద ఎత్తున శక్తి వెలువడుతుంది. ఆ శక్తిలో లేశమాత్రం మన భూమిని తాకుతోంది. అణుఇంధనం మినహా ఇప్పుడు మనం వినియోగిస్తున్న శక్తి వనరులన్నీ ఆ సౌరశక్తినుండి వచ్చేవే. (పెట్రోలు, పవనవిద్యుత్తు, అలల విద్యుత్తు వగైరా...)

అణు సంయోగంద్వారా భూమ్మీద కూడా విద్యుత్తు ఉత్పత్తిచేయడానికి పరిశోధనలు చేస్తున్నారు. హైడ్రొజన్ ఐసోటోపు అయిన డ్యూటిరియం సంయోగ క్రియతో అణువిద్యుదుత్పత్తి కోసం రియాక్టర్ తయారుచేసే పరిశోధన చురుగ్గా సాగుతోంది. అయితే అణు-సంయోగంలో ఒక చిక్కేమంటే ఈ సంయోగ క్రియ జరగాలంటేనే అత్యధిక శక్తి కావాలి. అంటే సూర్యుని ఉపరితలం మీద ఉన్నంత వేడిమిలో మాత్రమే అణు-సంయోగ క్రియ జరుగుతుంది. కానీ అంతటి వేడిలో అన్ని రకాల వస్తువులూ కరిగి ఆవిరైపోతాయి. అందువల్ల అణు-సంయోగక్రియకు మామూలు పదార్థాలతో రియాక్టర్ చేస్తే కుదరదు. అయస్కాంత క్షేత్రాన్ని సృష్టించి ఆ క్షేత్రంలో సంయోగక్రియ జరపాలి. డ్యూటీరియం పదార్థంతో సంయోగక్రియ జరిపితే ఈ అయస్కాంత క్షేత్రాన్ని సృష్టించే అయస్కాంతాలు కూడా కరిగిపోతాయి. దీనికి విరుగుడు ఒక్కటే. డ్యూటీరియంతో హీలియం3 ఐసోటోపును సంయోగం చేయడంద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేయడమే.

డ్యూటీరియం భూమ్మీద పెద్ద ఎత్తున దొరుకుతుంది. కానీ హీలియం3 భూమ్మీద చాలాచాలా తక్కువ. కాని చంద్రునిమీద అది సాపేక్షంగా పెద్ద మొత్తంలో లభిస్తోంది. చంద్రునిమీద మొదటిసారి అడుగుపెట్టిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, తరువాత చాలామంది అంతరిక్ష యాత్రీకులు తెచ్చిన మట్టి నమూనాలు పరిశీలించినప్పుడు శాస్త్రవేత్తలు అందులో పెద్ద ఎత్తున హీలియం3 ఉన్నట్లు కనిపెట్టారు. మన హైదరాబాదు నగరానికి సంవత్సరానికి అవసరమయ్యే విద్యుత్తు ఉత్పత్తి చేయాలంటే సుమారుగా వంద కిలోల హీలియం3 అవసరమవుతుంది. ఒక కిలోగ్రాము హీలియం3 ఉత్పత్తిచేయాలంటే చంద్రోపరితలం మీద రెండున్నర చదరపు కిలోమీటర్ల నేలను 9 అడుగుల లోతుకు తవ్వి ఆ మట్టినంతటినీ వడగట్టాలి (ప్రాసెస్ చేయాలి). ఆ విధంగా లభించిన హీలియం3ని భూమ్మీదకు పంపాలి.

చంద్రులనిమీదకు తక్షణం మానవుడు వెళ్లడం ఎందుకు అంటే ఈ హీలియం3 కోసం అంటున్నారు శాస్త్రవేత్తలు. హీలియం3-డ్యూటిరియం రియాక్టర్లను తయారుచేయడం ద్వారా మానవునికి కావలసిన అపారమైన ఇంధనాన్ని భవిష్యత్తులో ఉత్పత్తి చేయడం సాధ్యమవుతుంది. అంటే భవిష్యత్తు మానవాభివృద్ధి చంద్రోపరితలంపై గనుల తవ్వకం మీద ఆధారపడి ఉంటుంది. అక్కడ గనులు తవ్వాలంటే తవ్వే యంత్రాలను పట్టుకుపోవాలి. మట్టిని వడగట్టేందుకు పరిశ్రమలు పెట్టాలి. మానవులు నివసించేందుకు 'గృహాలు' నిర్మించాలి. వారికి నీరు, ఆహారం, వినోదానికి సదుపాయాలు ఏర్పాటుచేయాలి. అంత పెద్ద ఎత్తున వస్తువులను చంద్రునిపైకి చేర్చాలంటే చంద్రునిపైకి నిత్య ప్రయాణాలు సాగిస్తేనే గాని సాధ్యం కాదు.

ఇదంతా సాధ్యమేనా? ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానంతో కూడా సాధ్యమేనంటున్నారు నాసా శాస్త్రవేత్తలు. పైగా ఇది ఆర్థికంగా కూడా గిట్టుబాటయ్యే వ్యవహారమని చెబుతున్నారు. ఈ సదుపాయాలు ఏర్పాటుచేయడంవల్ల ఉప - ఉత్పత్తులుగా మానవాళికి మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయని కూడా చెబుతున్నారు. వాటి గురించి మరోమారు చెప్పుకుందాం! ✤

మెకంజీకైఫియత్తులు(రెండోభాగం)



'కైఫియతు' అనే హిందీ పదానికి వాఙ్మూలం లేక కవిలె గ్రంథం అని అర్థం. తెలుగుభాషలో ఇటువంటి కైఫీయతులకు కొదవేలేదు. ఈ గ్రంథంలో మనకు లభించిన కైఫియతులు ఆ కాలంలో వర్థిల్లిన చారిత్రక అంశాలనేగాక భాషా పరిస్థితులనూ తెలుసుకోవడానికి వీలు కల్పిస్తాయి. చాలా గ్రంథాలు వ్యవహారికభాషలోనే రాశారు. వీటికి ప్రత్యేక రచయితలెవరూ ఉండరు. మన స్థానిక చరిత్రల వంటివే ఈ కైఫీయతులు. వస్తుపరంగా చెప్పాలంటే ఆయా గ్రామాలకు, ప్రాంతాలకు సంబంధించిన సమాచారం వీనిలో నిక్షిప్తమై ఉంటుంది.

ఈ గ్రంథంలోని అక్షరంలోనూ పరిశోధకుల కష్టం ప్రస్ఫుటమౌతోంది. కడప జిల్లాకు సంబంధించిన ఒక పక్రియమీద వారి ప్రత్యేక శ్రద్ధ కొనియాడదగింది. రచనాపరంగా ఈ పుస్తకం రూపుదిద్దుకోవడానికి కారకులు ముగ్గురు. డా॥ జానుమద్ది హనుమచ్ఛాస్త్రి, శ్రీ కట్టా నరసింహులు, యన్. సి. రామ సుబ్బారెడ్డిగార్లు. కైఫియతుల గురించి చక్కని విశ్లేషణను కీ॥ శే॥ ఆచార్య దివాకర్ల వెంకటావధానిగారు గ్రంథ పరిచయంలో అందించారు. ఆయన చెప్పిన అంశాలు విస్మరించరానివి. ఎందుకంటే ఈ కైఫియతుల్లో భాష, ధ్వనులు, వర్ణక్రమవిధానం, అచ్చులోపం, క్రియా పదాలు, బహువచనరూపాలు, వావహారిక ప్రయోగాలు, విభక్తి ప్రత్యయాలు, సర్వనామ, సంఖ్యావాచక, అన్యదేశ్య, వాక్య నిర్మాణాదులు ఇవన్నీ నిర్ధారణ చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పిన సలహా సర్వదా శిరోధార్యం.

26 చాప్టర్లుగా విభజించి 26 ఊళ్లకు సంబంధించిన వృత్తాంతాలను ఈ కైఫీయతులపరంగా శోధించారు. వీటన్నిటినీ పాఠ్యాంశాలుగా రాయించడం, తప్పొప్పులను సరిచూడడం అంటే మాటలుకాదు. నేడు కడప జిల్లాలోగల జమ్మలమడుగు దగ్గర్నుంచి, పులివెందుల వరకూ ఎన్నో పల్లెటూళ్లలో దొరికిన వాటిని సంపాదించి, సంస్కరించి భద్రపరచడం కష్టసాధ్యమైన పని. అందుకోసం నెలకొన్న సి.పి. బ్రౌన్ యన్.వి. యూనివర్శిటీ ప్రాంతీయ పరిశోధనాకేంద్రం చేపట్టింది. కేవలం కడప జిల్లాలోని ఊళ్లేకాక, (చెన్నై) బళ్లారి మొదలైన ప్రాంతాల్లోసైతం వాటిని సంపాదించి ఒకచోట చేర్చారు.

ఇది చరిత్ర పరిశోధకులకే కాదు, భాషా పరిశోధకులకూ, వాఙ్మయ పరిశోధకులకూ ఎంతో అమూల్యమైన సమాచారం అందించగల ఈ కృషిని తెలుగు పాఠకలోకం అభినందించాల్సిందే.

మెకంజీ కైఫియత్తులు (రెండోభాగం)
సి.పి. బ్రౌన్, ప్రతులకు: కార్యదర్శి, సి.పి. బ్రౌన్ ఎస్వీ యూనివర్సిటీ, తెలుగుభాషా సాహిత్యాల ప్రాంతీయ పరిశోధనా కేంద్రం, సిపిబ్రౌన్ రోడ్, కడప- 516004

- డా॥ మంతెన



తెలంగాణ సాహిత్య స్వరూపాలు

సంపాదకత్వం
డా॥ ఐ. శ్రీరంగస్వామి
వెల: 40/-
పేజీలు: 50
ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

భారతదేశంలో
నదుల అనుసంధానం
గూడవల్లి నాగేశ్వరావు
వెల: 6/-,
పేజీలు: 36
ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్



వినోదాత్మక కథలు

ముందుమాటలో చెప్పినట్లు నసిరుద్దీన్ లేదా ముల్లా నసిరుద్దీన్ లేదా మౌల్వీ నసిరుద్దీన్ అనే వ్యక్తి చైనాలోని ఉయ్‌గల్, రష్యాలోని అజల్ బైజాన్, ఆసియా, ఆఫ్రికా దేశాల్లోని ప్రజలకు 'జానపద హీరో'. ఇందులో ఉన్న కథల్లో హాస్యం, వ్యంగ్యం, యుక్తి, సమయస్ఫూర్తి, తెలివితేటలు, అక్కడక్కడా అమాయకత్వం కనిపిస్తాయి. ఈ కథలు నూతన అక్షరాస్యులకు, వయోజనులకు, బాలపాఠకులకు వినోదంతోపాటు సమయస్ఫూర్తి, యుక్తి, మంచి ఆలోచనలను కలిగిస్తాయి, నిజమే. అయితే పఠనాసక్తి అధికంగా ఉన్నవారు మాత్రమే కథలన్నింటినీ వరసపెట్టి చదువుకుపోతారు, ఆనందిస్తారు. తక్కినవారైతే 'ఆహా! అన్పించే కథలతోపాటు రోటీనే' అనుకుని చప్పరించేస్తారు. అన్నిరకాల కథలూ ఉంటాయి. ప్రతి ఒక్కరినీ సంతోషపెట్టలేం. కథ అందరూ గుర్తుంచుకోవలసింది. 'ప్రేమ స్వరూపుడు' కథ భక్తి ఉన్నప్పుడు భయపడనక్కరలేదని చెబుతోంది. కానీ నేడు చాలామంది భయంవల్లనే భక్తులవుతున్నారు. వారి పాపభీతి ఎలా ఉంటుందంటే పాపం తగులుతుందని తప్పులు చేయడం మానరు. ఎన్ని తప్పులు చేసినా దేవుడి ముందు లెంపలు వాయించుకుంటే సరి అనే ధోరణితో బతుకును యథాతథంగా కొనసాగిస్తూనే ఉంటారు. కనుక ఇవి ఆదర్శకథలనలేంగానీ మంచి కాలక్షేపాన్నిచ్చే కథలనవచ్చు.



(నసిరుద్దీన్ కథలు 1,2 భాగాలు, పునఃకథనం : పి. రాజేశ్వరరావు, సెట్ వెల: 60/-, పేజీలు:28, ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రముఖ పుస్తక విక్రేతలు, ప్రతిభ పబ్లికేషన్స్, ప్లాట్ నెం - 2, శ్రీ శంకర్ కాలనీ, ఎల్.బి. నగర్, హైదరాబాద్ - 14)

- శ్రీకృష్ణవరప్రసాద్

గుమ్మడి స్పెషల్



కావలసిన పదార్థాలు

చిన్న గుమ్మడికాయ - ఒకటి
ఉప్పు - చాలినంత
పంచదార
లేదా బెల్లం - ఒక టీస్పూన్
మినప్పప్పు - ఒక టీ స్పూన్
ఎండుమిర్చి - నాలుగు
పచ్చిమిర్చి - రెండు
నూనె - ఒక టేబుల్‌స్పూన్

తయారు చేసే పద్ధతి

గుమ్మడికాయ చెక్కు తీయనవసరం లేదు. ముక్కలుగా కోసి గింజలు, మెత్తని పదార్థాన్ని తీసేయాలి. ఈ ముక్కలను కడిగి ఒక పాత్రలో ఉడకబెట్టాలి. ఉడుకుతున్నప్పుడే కొంచెం ఉప్పు, పంచదార లేక బెల్లం వెయ్యాలి. పచ్చిమిర్చి చీల్చి వెయ్యాలి. బాగా మెత్తగా ఉడికిన తర్వాత దింపి గరిటతో కచ్చాపచ్చాగా నొక్కాలి. ముక్కలు విడిపోయి ముద్దగా అవుతుంది. మూకుట్లో మిరపకాయలు, మినప్పప్పు వేసి వేయించాలి. వేయించిన దానిలో ఉడికిన గుమ్మడి గుజ్జువేసి పోపు పెట్టాలి. వెంటనే మూతపెడితే వాసనపోకుండా ఉంటుంది. ఈ కూర అన్నంలోనే కాదు వట్టిది తిన్నా బాగుంటుంది.

రుచి

కావలసిన పదార్థాలు

అరటికాయలు - రెండు
కొబ్బరి - అరచెక్క
ఉప్పు - చాలినంత
మినప్పప్పు - ఒక టీ స్పూన్
జీలకర్ర - కొంచెం
పసుపు - కొంచెం
ఉల్లిపాయలు - రెండు
ఆవాలు - ఒక టీ స్పూన్
నూనె - రెండు టీ స్పూన్లు
పచ్చిమిర్చి - నాలుగు
ఎండుమిర్చి - నాలుగు

తయారు చేసే పద్ధతి

అరటికాయ చెక్కుతీసి చిన్న చిన్న ముక్కలుగా కోసి ఉంచాలి. ఒకపాత్రలో నీళ్లపోసి అందులో ఈ ముక్కలను ఉడకబెట్టాలి. ఉడుకుతున్నప్పుడే ఉప్పు, పసుపు వెయ్యాలి. నీళ్ల ఎక్కువ కాకుండా ఉడకడానికి సరిపోయేవి మాత్రమే పోయాలి. మూకుట్లో నూనెపోసి బాగా మరిగించాలి. మినప్పప్పు, పచ్చిమిరపకాయ ముక్కలు, ఎండుమిర్చి, ఉల్లిపాయముక్కలు, ఆవాలు, జీలకర్ర కరివేపాకు వేసి వేయించాలి. బాగా వేగిన తర్వాత ఉడికిన అరటికాయ ముక్కలను వేసి పోపు పెట్టాలి. వెంటనే మూతపెట్టేస్తే వాసన పోకుండా ఉంటుంది.

అరటికాయకూర



కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలంస్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : కె.చంద్రనాయక్
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
స్కూలు : ఎపిటిడబ్ల్యుఆర్, శ్రీశైలం డ్యామ్ తూర్పు.
లక్ష్యం : ఇంజనీర్ అవడం
హాబీలు : కబడ్డీ క్రికెట్ ఆడడం, ముగ్గులు వేయడం.
చిరునామా : కె.చంద్రనాయక్, సన్నాఫ్ రామ్లా నాయక్, పిక్కర్లపల్లె తాండ (గ్రా), కొండమనుయునిపల్లె (పోస్ట్), అవుకు (మం), కర్నూలు జిల్లా.

పేరు : దేవులపల్లి పూజ
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
స్కూలు : శ్రీ వాణి విద్యాలయం
లక్ష్యం : డాక్టర్ అవడం
హాబీలు : ప్రజాశక్తి చదవడం.
చిరునామా : దేవులపల్లి పూజ, డాటరాఫ్ నర్సింగరావు, నంగునూరు (పోస్ట్ & మం), మెదక్ జిల్లా. 502 280.

పేరు : మర్రి సుష్మ
వయసు : 9 సం॥
చదువు : 5వ తరగతి
స్కూలు : ఎం.పి.ఇ.ఎస్.
లక్ష్యం : టీచర్ అవడం
హాబీలు : చెస్ ఆడడం, చదువుకోవడం.
చిరునామా : మర్రి సుష్మ, డాటరాఫ్ శేఖర్, మామిడిపల్లి (పోస్ట్), సోంపేట (మం), శ్రీకాకుళం జిల్లా. 532 264.

పేరు : సాటు విజయ్‌కుమార్
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి, ఆదివారం 'స్నేహ' చదవడం, క్రికెట్ ఆడడం, ఎఫ్.ఎమ్ రేడియో వినడం.
చిరునామా : సాటు విజయ్‌కుమార్, సన్నాఫ్ అంతయ్య, సింగారం (గ్రా), పెనిమిల్ల (పోస్ట్),అచ్చంపేట (మం), మహబూబ్‌నగర్.

పేరు : గుంటిపల్లి సాయిరాం
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
స్కూలు : శ్రీ వాణి విద్యాలయం
లక్ష్యం : న్యాయవాది అవడం
హాబీలు : ప్రజాశక్తి చదవడం
చిరునామా : గుంటిపల్లి సాయిరాం, సన్నాఫ్ సత్యనారాయణ, నంగునూర్ (పోస్ట్ & మం), మెదక్ జిల్లా. 502 280.

పేరు : అన్వేష్ దనసరి
వయసు : 16 సం॥
చదువు : 10వ తరగతి
స్కూలు : జెడ్.పి.హెచ్ స్కూల్
లక్ష్యం : ఇంజనీర్ అవడం
హాబీలు : పుస్తకాలు చదవడం, క్యారమ్స్ ఆడడం.
చిరునామా : డి.అన్వేష్, సన్నాఫ్ రామరాజు, రాజనపల్లి (గ్రా), గూడూరు (మం), వరంగల్ జిల్లా.

పేరు : బూరెడ్డి సందీప్‌రెడ్డి
వయసు : 12 సం॥
చదువు : 6వ తరగతి
స్కూలు : శ్రీ శారదా విద్యామందిర్ ఉన్నత పాఠశాల
లక్ష్యం : ఇంజనీర్ అవడం
హాబీలు : కబడ్డీ, క్రికెట్ ఆడడం.
చిరునామా : బూరెడ్డి సందీప్‌రెడ్డి, సన్నాఫ్ సంజీవరెడ్డి, గుండ్ల సింగారం (గ్రా), నూతనకల్ (మం), నల్గొండ జిల్లా. 508 221.